

బారు డీలా సాగే..!

వ్యూహాత్మక బార్ పాలసీని ప్రభుత్వం తెరపైకి తెచ్చింది. కొత్త పాలసీలో ఒక్కో బార్‌కు నాలుగు దరఖాస్తులు ఉంటేనే లాటరీ పద్ధతి అని ప్రకటించడంతో యాజమాన్యాలు జీర్ణించుకోలేక పోతున్నాయి. వైసీపీ హయాంలో బార్లలో అమ్మకాలు జోరుగా సాగాయి. మద్యం షాపుల్లో నాణ్యమైన మద్యం దొరికేది కాదు. ఎంఆర్‌పీ కంటే అదనంగా రూ.50 అధిక ధరలకు విక్రయించేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రైవేట్ మద్యం పాలసీ అమలు చేసింది. ప్రైవేట్ దుకాణాల్లో నాణ్యమైన బ్రాండ్లు అమ్మకాలు సాగిస్తున్నాయి. ధరలు కూడా తగ్గాయి. బార్లలో అమ్మకాలు పడిపోయాయి. బార్లలో అమ్మకాలు గతంతో పోల్చుకుంటే 50శాతం కూడా ఉండడం లేదు.



- ఆసక్తి చూపని దరఖాస్తులు
- బార్లకు తగ్గిన ఆదాయం
- ఇప్పటివరకు 16 దరఖాస్తులు

నంద్యాల/ నంద్యాల టౌన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో చాలా మంది బార్లకు టెండర్లు నోటిఫికేషన్ విడుదల చేయగానే దరఖాస్తు చేసుకున్నారు. ప్రస్తుతం ధర తగ్గించి ఆరు విడతల కట్టాల్సిన పరిస్థితి ఉన్నా ఎవరూ కూడా బార్ల టెండర్లకు దరఖాస్తు చేసుకోవడానికి ముందుకు రాలేదు. ఇందుకు కేవలం ఈ ప్రభుత్వంలో వైన్స్ ఏర్పాటు చేసినప్పటి నుంచి ఇప్పటి వరకు ఎక్సైజ్ శాఖ వారికి ఇష్టం వచ్చినట్లు అమ్మకాలు, పర్మిషన్లు స్థానిక సీఐ ఒకరు రాజకీయ నాయకులతో కుమ్మక్కై చేయడంతో బార్లకు టెండర్ల వేయడానికి రావడం లేదనే విమర్శలు ఉన్నాయి. బార్ల వ్యాపారుల నుంచి టెండర్ల స్వీకరణకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గత ప్రభుత్వం పాలసీ కంటే నూతన పాలసీతో ఆయా వ్యాపారులు, కొత్తగా వచ్చే వ్యాపారులకు ఆర్థిక భారం తగ్గించడంతో పాటు బార్ల నిర్వహణ సమయం.. తదితర రూపాల్లో కలిసి వచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. నంద్యాల జిల్లా వ్యాప్తంగా 19బార్లకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందులో కూటమి ప్రభుత్వం ఈడిగ, గౌడ్ కులస్థులకు రెండు బార్లను ప్రత్యేకంగా కేటాయించింది. ఈ నేపథ్యంలో ఈనెల 18నుంచి ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా జనరల్ కేటగిరి బార్లకు 16 దరఖాస్తులు వచ్చాయి. అయినప్పటికీ బార్ల కోసం దరఖాస్తులు తక్కువగా రావడంపై ఆశాఖలో ఆందోళన కలిగిస్తోంది.

జిల్లాలో వివరాలు ఇలా...

నంద్యాల	: 14
డోన్	: 01
ఆళ్లగడ్డ	: 01
నందికొట్కూరు	: 01
ఆత్మకూరు	: 01
బేతంచెర్ల	: 01
గౌడ కులస్థులకు	: 01
ఈడిగ కులస్థులకు	: 01

ఆరు విడతలుగా చెల్లించే వెసులుబాటు

వీటిలో సంవత్సరానికి గాను ఒక్కొక్క దరఖాస్తు దారుడు రూ.5 లక్షలు నాన్ రిఫండబుల్ అమౌంట్ చెల్లించి దరఖాస్తు చేసుకోవాలి. అలాగే డిప్‌లో వచ్చిన తర్వాత గ్రామ పంచాయతీ అయితే రూ.35 లక్షలు, పట్టణం అయితే రూ.55లక్షలు మొత్తం చెల్లించాలి. ఈ మొత్తాన్ని కూడా ఆరు విడతలు కూడా చెల్లించే వెసులుబాటు కల్పించారు. ఇదిలా ఉండగా నంద్యాల జిల్లాలో 19 జనరల్ బార్లకు, 2 ఈడిగ, గౌడ కులస్థులకు వచ్చాయి. అయితే ప్రతిఒక్క బారుకు తప్పనిసరిగా 4 దరఖాస్తులు వస్తేనే వాటిని లక్కీ డిప్‌లో పెడతారు. ఈ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా కొందరు నాయకులు కేవలం నలుగురితో మాత్రమే దరఖాస్తులు వేయించి బార్‌ను కొట్టాయాలనే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. ఇందుకు స్థానిక నాయకులతో కలిసి ఏర్పాట్లు చేసుకుని ఎవరినీ రానివ్వకుండా చేయాలని చూస్తున్నట్లు సమాచారం.

పారదర్శకంగా నిర్వహిస్తాం

బార్ల టెండర్లు ఎవరికి అనుకూలంగా చేయం. అందరి ముందే పారదర్శకంగా నిర్వహిస్తాం. అన్నివిధాలా దరఖాస్తుదారులకు సహకారం అందించి ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదు. నంద్యాలలోని ఎక్సైజ్ కార్యాలయానికి వచ్చి వారి వివరాలు చెప్పి దరఖాస్తు రుసుం చెల్లిస్తే దరఖాస్తు చేస్తాం. ఇక్కడా ఎలాంటి మోసాలు జరగవు.

● రవికుమార్, ఎక్సైజ్ సూపరింటెండెంట్, నంద్యాల

● **నిబంధనల్లో స్వల్ప మార్పులు**

ప్రభుత్వ నిబంధనల్లో తాజాగా శుక్రవారం స్వల్ప మార్పులు చోటు చేసుకున్నాయి. నిజానికి గతంలో ప్రతి బార్‌కు నాలుగు దరఖాస్తులు వస్తే మాత్రమే ఆయా బార్లకు లక్కీ డిప్ తీసి ఎంపిక చేయాలని నిబంధన విధించారు. ఇక బార్లకు దరఖాస్తులు నాలుగు కంటే తక్కువ వస్తే మాత్రం ఆయా బార్లకు వచ్చిన దరఖాస్తులు రద్దు చేసి మరోమారు టెండర్లు పిలిచేలా నిర్ణయించారు. అయితే తాజాగా ప్రభుత్వం బార్లకు చెల్లించే నాన్ రిఫండ్‌బుల్ అమౌంట్ విషయంలో వ్యాపారులకు అనుకూలంగా ఓ అడుగు ముందుకేసింది. తక్కువ దరఖాస్తులు వస్తే ఆయా బార్ల దరఖాస్తులను రద్దు చేసి రిఫండ్‌బుల్ అమౌంట్‌ను (మొదట చెల్లించే రూ.5లక్షలు) వెనక్కి ఇచ్చే విధంగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆసక్తి కలిగిన బార్ల వ్యాపారులకు ఈ నిర్ణయం కలిసి రానుంది. ఈ క్రమంలో నేటి నుంచి బార్ల కోసం దరఖాస్తులు పెరిగే అవకాశం ఉందని ఎక్సైజ్ శాఖ భావిస్తోంది.



ఇక మూడు రోజులే గడువు

నిబంధనల ప్రకారం ఈనెల 18 నుంచి ఈనెల 26వ తేదీ సాయంత్రం 5 గంటలకు వరకు దరఖాస్తుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఇప్పటికే 6 రోజులు గడవగా.. 16 దరఖాస్తులు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఇక మూడు రోజులు మాత్రమే గడువు మిగిలి ఉంది. తాజాగా నాన్ రీఫండబుల్ ఫీజు (రూ.5లక్షలు) వెనక్కి ఇచ్చే విధంగా ఉత్తర్వులు జారీచేసింది. ప్రతి బార్‌కు నాలుగు దరఖాస్తుల కంటే తక్కువగా ఉంటేనే దరఖాస్తు ఫీజు వెనక్కి వచ్చే అవకాశం ఉంది. లేనిపక్షంలో లక్కీడిప్ నిర్వహించి ఎంపికైన వారికి బార్‌ను కేటాయిస్తారు. ఎంపిక కాని వారికి ఎలాంటి రుసుం చెల్లించరు. వీటితో పాటు ప్రాసెసింగ్ ఫీజుగా చెల్లించే రూ.10 వేలు మాత్రం ఎట్టిపరిస్థితుల్లోనూ వెనక్కి రాదు.

నాలుగు దరఖాస్తులు తప్పనిసరి

సూపరింటెండెంట్ రవి కుమార్



నంద్యాల జిల్లాలో 21 బార్లకు నోటిఫికేషన్ విడుదల చేశాం. వాటికి ప్రతి బార్‌కు తప్పనిసరిగా నాలుగు దరఖాస్తులు, అంతకంటే ఎక్కువగా ఉంటేనే లక్కీడిప్ నిర్వహిస్తాం. ఒకవేళ ముగ్గురు మాత్రమే దరఖాస్తు చేసుకుంటే వారు చెల్లించిన రూ.5లక్షలు వెనక్కి ఇచ్చేస్తాం. నలుగురు ఉంటే వారి ప్రాంతానికి సంబంధించిన బార్ డిప్ తీస్తాం. ప్రభుత్వం తాజాగా తీసుకున్న ఈ నిర్ణయంతో టెండర్‌దారులకు ఊరటనిస్తుంది. దీంతో రాబోయే మూడు రోజులు బార్ల కోసం దరఖాస్తులు పెరిగే అవకాశం ఉంది.

గణేశ్ ఉత్సవాలను విజయవంతం చేయాలి

- అధికారులు, కమిటీ సభ్యులు సమన్వయంతో ముందుకెళ్లాలి
- కలెక్టర్ రాజకుమారి



జూట్ బ్యాగ్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఎస్పీ, అధికారులు

నంద్యాల ఎడ్యుకేషన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): గణేశ్ ఉత్సవాల్లో అధికారులు, కమిటీ సభ్యులు సమన్వయంగా వ్యవహరిస్తూ ఉత్సవాలను విజయవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ రాజకుమారి కోరారు. నంద్యాల కలెక్టర్ కార్యాలయంలోని వీసీ హాల్‌లో వినాయక చవితి ఉత్సవాల ఏర్పాట్లపై ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా, జేసీ విష్ణుచరణ్‌తో కలిసి సంబంధిత అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ చిన్నచెరువు వద్ద ఐదు నిమజ్జన పాయింట్లు ఏర్పాట్లు చేయాలని, బండ్‌ను పటిష్టంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నిమజ్జన సమయంలో గత ఈతగాళ్లను ఏర్పాటు చేయాలని మత్స్యశాఖ అధికారులను, విగ్రహాలను ఏర్పాటుచేసే చోట సరిపడా లైటింగ్ ఉండేలా చూసుకోవాలని విద్యుత్ అధికారులను, నిమజ్జన పరిసర ప్రాంతాల్లో శానిటేషన్ పకడ్బందీగా నిర్వహించాలని మున్సిపల్ అధికారులను, మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని డీఎంహెచ్‌వోను, ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చూసుకోవాలని పోలీసుశాఖను ఆదేశించారు. నీటి ప్రవాహం అధికంగా ఉండడంతో తగిన చర్యలు తీసుకోవాలని కేసీ కెనాల్ అధికారులకు సూచించారు. ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా మాట్లాడుతూ విగ్రహాల ఏర్పాటుకు గణేశ్ ఉత్సవ.నెట్‌లో నమోదు చేసుకోవడం ద్వారా సింగిల్ విండో అనుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు. అనంతరం పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయకున్ని పూజిద్దాం, పర్యావరణాన్ని పరిరక్షిద్దాం అని ముద్రించిన జూట్ బ్యాగ్స్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో డీఆర్వో రామునాయక్, ఏఎస్పీ మందజావలి, ఆర్డీవోలు విశ్వనాథ్, నాగజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కార్మికశాఖ జాయింట్ కమిషనర్ కార్యాలయంలో

ఏసీబీ సోదాలు

కర్నూలు క్రైం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): కార్మిక శాఖ జాయింట్ కమిషనర్ బాలునాయక్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. నగరంలోని చల్లా కాంపౌండులో ఉన్న ఆయన కార్యాలయంలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి ఏసీబీ సీఐ కృష్ణయ్య, ఎస్ఐ సుబ్బరాయుడు తనిఖీ చేశారు. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారన్న సమాచారంతో తిరుపతి ఏసీబీ అధికారులు ఆయనకు సంబంధించిన పలు ప్రాంతాల్లో మూకుమ్మడిగా సోదాలు చేశారు. బాలు నాయక్ సొంత జిల్లా కడప. రాయచోటి వద్ద తండా. ఆత్మకూరులో ఏవోగా పనిచేశారు. 2020-21లో కర్నూలు రీజనల్ కార్యాలయంలో డీసీగా పనిచేశారు. ఆతర్వాత జాయింట్ కమిషనర్ ఎఫ్ఏసీగా కొనసాగారు. ఏడాది క్రితం జాయింట్ కమిషనర్‌గా పదోన్నతి పొంది కర్నూలులోనే విధులు నిర్వహిస్తున్నారు. బాలాజీ నగర్‌లో ఓఇంటిని అద్దెకు తీసుకుని నివాసం ఉంటున్నారు. తిరుపతి, మదనపల్లి, రాయచోటి ప్రాంతాల్లో ఆస్తులు కూడబెట్టినట్లుగా సమాచారం. బాలాజీనగర్‌లో ఉన్న తన ఇంటికి తాళంవేసి ఉండడంతో ఆయన కొడుకును పిలిపించుకుని సోదాలు నిర్వహించారు.

జిల్లాలో 50 లక్షల మంది

మహిళలకు లబ్ధి

బస్టాండ్‌ను పరిశీలించిన ఆర్ఎం



చాగలమర్రి ఆర్టీసీ బస్టాండును పరిశీలిస్తున్న ఆర్ఎం

చాగలమర్రి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఉచిత బస్సు ప్రయాణం వల్ల జిల్లాలో 50 లక్షల మంది మహిళలకు లబ్ధి చేకూరిందని జిల్లా ఆర్ఎం రజియా సుల్తాన తెలిపారు. 'నీటి కుంటలా బస్టాండు' అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన ఆర్ఎం శుక్రవారం చాగలమర్రి ఆర్టీసీ బస్టాండును తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ ఆగస్టు 15 నుంచి జిల్లాలో 4.03 లక్షల మంది ప్రయాణం చేయగా అందులో 1.16 లక్షల మంది మహిళలు ఉచితంగా ప్రయాణం చేశారని వెల్లడించారు. బస్టాండులోని దుకాణాలకు ఈనెల 29న టెండర్లు వేస్తున్నామని, ఈనెల 28 లోపు నంద్యాల ఆర్ఎం కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఆళ్లగడ్డ, చాగలమర్రి బస్టాండులో మరుగుదొడ్ల నిర్మాణాలను చేపడతామన్నారు. నీటి కుంటగా ఉన్న బస్టాండు రహదారులకు మరమ్మతులు చేపడతామన్నారు. మహిళలు ఆధార్‌కార్డు జిరాక్స్ ఫోన్‌లో కూడా చూపించి ఉచితంగా ప్రయాణించ వచ్చన్నారు. జిల్లా ఈఈ ఎస్ఎస్ఆర్ నాయుడు, కోవెలకుంట్ల డీఎం నాగరాజు, ఆళ్లగడ్డ సూపరింటెండెంట్ శ్రీనివాసులు, ఆర్టీసీ సిబ్బంది, ఇంజనీరింగ్ సహాయకులు పాల్గొన్నారు.

వైభవంగా సామూహిక వరలక్ష్మీ వ్రతం



చంద్రావతి కల్యాణ మండపంలో సామూహిక వ్రతాలకు హాజరైన మహిళలు

నంద్యాల కల్చరల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): శ్రీశైల దేవస్థానంలోని చంద్రావతి కల్యాణ మండపంలో ధర్మప్రచారంలో భాగంగా శ్రావణమాసం శుక్రవారం సామూహికంగా వరలక్ష్మీవ్రతం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నంద్యాల, ప్రకాశం, పల్నాడు జిల్లాలోని 90 చెంచుగూడేలకు చెందిన గిరిజన భక్తులను ఆహ్వానించారు. చెంచు గిరిజన భక్తులు 650మంది, ఇతర భక్తులు 950మందికి పైగా పాల్గొన్నట్లు ఆలయ ఈవో శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్చకులు, ఆలయ సిబ్బంది, స్థానిక ఐటీడీఏ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బిల్లుల కోసం ఎదురుచూపులు

- ముందుకు సాగని అభివృద్ధి పనులు
- నిధి పోర్టల్‌లో అప్‌లోడ్ అయితేనే..
- పెండింగ్‌లో 90 బిల్లులు
- ఇబ్బందుల్లో కాంట్రాక్టర్లు
- మామూళ్ల మత్తులో అధికారులు

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అభివృద్ధి పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు బిల్లుల కోసం ఎదురు చూస్తున్నారు. నగరపాలక సంస్థ పరిధిలో కూటమి ప్రభుత్వం వచ్చాక 160 అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు రూ.40 కోట్లు పెండింగ్‌లో ఉండటంతో వారు తల్లడిల్లుతున్నారు. బిల్లులు రాకపోవడంతో కొన్నిచోట్ల పనులు నిలిచిపోయాయి. నగరంలో జరుగుతున్న కోట్లాది పనులకు గతంలో 60 మంది కాంట్రాక్టర్లు పనిచేసేవారు. బిల్లులు రాకపోవడంతో ప్రస్తుతం కేవలం 15మాత్రమే పని చేస్తున్నారు. ఒక్కొక్క కాంట్రాక్టరుకు రూ.60లక్షల నుంచి రూ.2కోట్ల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం.

కూటమి ప్రభుత్వం నిధి పోర్టల్‌ను..

కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో బిల్లుల కోసం కాంట్రాక్టర్లకు ఇబ్బందులు తప్పడం లేదు. వైసీపీ ప్రభుత్వ హయాంలో సీఎఫ్ఎంఎస్‌లో అప్‌లోడ్ చేసేవారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వచ్చాక నిధి పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం నిధి పోర్టల్‌ను ప్రారంభించే ముందు బిల్లులు త్వరితగతిన అప్‌లోడ్ అవడంతో పాటు డబ్బులు కూడా కాంట్రాక్టర్ల ఖాతాలో జమ అవుతాయని చెప్పారు. ఇప్పటివరకు నిధి పోర్టల్‌లో అప్‌లోడ్ చేసిన బిల్లులు మంజూరు కాలేదు.

● జగన్నాథగట్టు వద్ద నిర్మిస్తున్న ట్రిపుల్ ఐటీ భవనానికి నీటి సరఫరా కోసం రూ.8 కోట్లు మంజూరు చేశారు. పనులు ప్రారంభం అయ్యాయి. కేవలం రూ.3కోట్లు మాత్రమే నిధి పోర్టల్‌లో అప్‌లోడ్ చేశారు. మిగిలిన రూ.5 కోట్లు ఇంకా పోర్టల్‌లో అప్‌లోడ్ చేయలేదు.



● నగరపాలక కార్యాలయం వెనుక నూతన కార్యాలయం భవనం రూ.29 కోట్లతో నిర్మిస్తున్నారు. ఇప్పటి వరకు కాంట్రాక్టర్‌కు రూ.5 కోట్లు మాత్రమే బిల్లులు మంజూరు అయ్యాయి. రూ.5కోట్లు నిధి పోర్టల్‌లో ఉంది. మిగిలిన నిధులు వచ్చే వరకు పనులు చేయమని కాంట్రాక్టర్ తేల్చి చెప్పారు.

మిగతా 6వ పేజీలో

సుంకేసులకు 1.40 లక్షల క్యూసెక్కుల వరద

- ఉధృతంగా ప్రవహిస్తున్న తుంగభద్ర
- శ్రీశైలానికి కొనసాగుతున్న 4,70,039 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

కర్నూలు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): తుంగభద్రకు వరద ప్రవాహం కొనసాగుతోంది. కర్నూలు నగరానికి ఆనుకొని 1,35,402 క్యూసెక్కుల ప్రవాహంతో జల ప్రేమికులను తుంగభద్ర కనువిందు చేస్తోంది. సుంకేసుల బ్యారేజీకి శుక్రవారం 1.40 లక్షల క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. 1.20 టీఎంసీలకు మించి అదనంగా నిల్వ చేసుకునే సామర్థ్యం లేదు. దీంతో జలాశయం భద్రత దృష్ట్యా వచ్చిన వరదను వచ్చినట్లుగా దిగవున శ్రీశైలానికి వదిలేస్తున్నారు. 20 గేట్లెత్తి 1,35,402 క్యూసెక్కుల మేర వరదను నదికి విడుదల చేయగా, 2,375 క్యూసెక్కులు కేసీ కాలువకు వదులుతున్నారు. 290.20 మీటర్ల లెవల్‌లో 0.608 టీఎంసీలు మాత్రమే నిల్వ చేశారు. రాయలసీమ జీవనాడి తుంగభద్ర డ్యాంకు 80,500 క్యూసెక్కుల వరద కొనసాగుతోంది. గరిష్ఠ నీటి మట్టం 1,633 అడుగులు, పూర్తిస్థాయి సామర్థ్యం 105.788 టీఎంసీలు కాగా, 1,624.54 అడుగుల లెవల్‌లో 74.96 టీఎంసీలు నిల్వ చేశారు. 85,351 క్యూసెక్కులు నదికి, 9,200 క్యూసెక్కులు వివిధ కాలువలకు విడుదల చేస్తున్నారు.



నిండుకుండలా దర్శనమిస్తున్న సుంకేసుల జలాశయం

శ్రీశైలానికి పోటెత్తిన వరద:

తెలుగు రాష్ట్రాల ప్రాణనాడి శ్రీశైలం జలాశయానికి వరద పోటెత్తుతోంది. ఎగువన సుంకేసుల బ్యారేజీ (తుంగభద్ర), జూరాల ప్రాజెక్టు (కృష్ణా నది) గేట్లు దాటి 7,70,039 క్యూసెక్కులు వరద వచ్చి చేరుతోంది. స్పిల్‌వే 10 క్రస్ట్‌గేట్ల 18 మీటర్లు పైకెత్తి 4,21,530 క్యూసెక్కులు, ఏపీ, తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు ద్వారా 64,953 క్యూసెక్కులు కలిపి 4,86,963 క్యూసెక్కులు దిగువ నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తున్నారు. ఏపీ ప్రభుత్వం పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి 30 వేలు తీసుకోగా, మల్యాల ఎత్తిపోతల పథకం ద్వారా హంద్రీనీవా కాలువకు 2,818 క్యూసెక్కులు ఎత్తిపోస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా 800 క్యూసెక్కులు ఎత్తిపోస్తున్నారు.

ఉరుకుంద హుండీ ఆదాయం రూ. 1.08 కోట్లు 6

మత్తు మందులు అడిగితే సమాచారమివ్వండి
● నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తే చర్యలు 7
● అడిషనల్ ఎస్పీ యుగంధర్‌బాబు

సాగుకు యోగ్యంకాని భూములిచ్చారు.. 7

తడిసిపోతున్నాయ్..!

- రికార్డుల గదులను తనిఖీ చేయని అధికారులు
- పలు కార్యాలయాల్లో శిథిలావస్థలో భవనాలు
- భయంతో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు


తడిసిపోయిన ఫైళ్లు

కర్నూలు కలెక్టరేట్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఏ కార్యాలయంలో అయినా ఏదైనా సమాచారం కావాలంటే ముందుగా వెతికేది రికార్డులే. అలాంటి రికార్డులు భద్రంగా ఉన్నాయా.. లేదా అన్న విషయాన్ని అధికారులు పూర్తిగా విస్మరించారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో భూములు, రెవెన్యూ తదితర రికార్డులన్నీ ఒక ప్రత్యేక గదిలో భద్రపరుస్తారు. ప్రతి సంవత్సరం వర్షాకాలంలో రికార్డు భద్రపరిచిన గదిలో అక్కడక్కడ వర్షపు నీరు చేరుతోంది. కానీ ఆ రికార్డు రూమును ఏరోజు కూడా అధికారి తనిఖీ చేయడం లేదు. అలా ఆ వర్షం నీరుతో రికార్డులన్నీ తడిసి ముద్దవుతున్నాయి. మరికొందరు సిబ్బంది రికార్డులు తడిసిపోయిన కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. కొన్ని కార్యాలయాలు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. శిథిలావస్థలో ఉన్న కార్యాలయంలో రికార్డులన్నీ చేతికి అందని స్థితికి చేరుకుంటున్నాయి. కలెక్టరేట్‌లోని శ్రీశైలం ప్రాజెక్టు కార్యాలయం శిథిలావస్థకు చేరింది.


పెచ్చులూడిన పైకప్పు


ఇటుకలు పడిపోయిన గోడ



వర్షం వస్తే చాలు.. కార్యాలయం చిత్తడిగా మారుతోంది. కార్యాలయంపై భాగం పెచ్చులూడిపోయి కిందపడుతోంది. వర్షం నీరు రావడంతో పాత రికార్డులన్నీ జలమయమవుతున్నాయి. భవనం శిథిలావస్థకు చేరడంతో కార్యాలయంలో పని చేసే సిబ్బంది కూడా భయభ్రాంతులకు గురవుతున్నారు.

విదేశాలకు ఉత్పత్తుల ఎగుమతులకు సహకారం

రాయలసీమ రీజియన్ పీఎంజీ కార్యాలయం ఏడీ రామకృష్ణ


వ్యాపారులకు అవగాహన కల్పిస్తున్న పోస్టల్ అధికారులు

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): వ్యాపారులు తమ ఉత్పత్తులను విదేశాలకు ఎగుమతి చేసేందుకు పోస్టల్ శాఖ పూర్తి సహకరిస్తుందని రాయలసీమ రీజియన్ పోస్టుమాస్టర్ జనరల్ కార్యాలయం అసిస్టెంట్ డైరెక్టర్ వై.రామకృష్ణ అన్నారు. నగరంలోని ప్రధాన తపాలా కార్యాలయంలో వ్యాపారవేత్తలు, చిన్నవ్యాపారులు, ఉత్పత్తిదారులకు తమ ఉత్పత్తులను విదేశాలకు ఎలా ఎగుమతి చేయాలనే అంశంపై శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. అవగాహన కార్యక్రమానికి కర్నూలు, నంద్యాల, అనంతపురం, హిందూపురం జిల్లాలకు సంబంధించిన క్లస్టర్‌లు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వ్యాపారులు తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఏడీ రామకృష్ణ మాట్లాడుతూ విదేశీ మార్కెట్లకు ఎగుమతులపై అవకాశాలపై పోస్టల్ శాఖలో అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చిన్న వ్యాపారవేత్తలు, ఉత్పత్తిదారులు తపాలాశాఖ ద్వారా సులభంగా, వేగంగా తక్కువ వ్యయంతో తమ ఉత్పత్తులను విదేశాలకు ఎగుమతి చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో పీఎంజీ రీజనల్ కార్యాలయం ఏడీ నాగానాయక్, పోస్టల్ సూపరింటెండెంట్ జి.జనార్దన్‌రెడ్డి, సర్కిల్ కార్యాలయం నుంచి వెంకట సాయి, ఫజుల్ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

29న తెలుగు కవుల సమ్మేళనం

కర్నూలు కల్చరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఈనెల 29న తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో తెలుగు కవుల సమ్మేళనం ఏర్పాటు చేసినట్లు కళాక్షేత్రం అధ్యక్షులు కళారత్న పత్తి ఓబులయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 29న సాయంత్రం 6 గంటలకు కళాక్షేత్రంలోని సాహితీ వేదికపై ఈసమ్మేళనం ఉంటుందని చెప్పారు. ఇందులో పాల్గొనే కవులు తెలుగు భాషలో పద్యం గానీ, గేయ కవిత్వం గానీ మూడు నిమిషాల వ్యవధిలో చదవాల్సి ఉంటుందని తెలిపారు. ఈ కవుల సమ్మేళనంలో పాల్గొన్న కవులకు కళాక్షేత్రం ఛైర్మన్, రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ చేతుల మీదుగా సత్కారం ఉంటుందని తెలిపారు. ఆసక్తిగల కవులు, కవయిత్రులు తమ పేర్లు 9989265632 వాట్సాప్ నెంబరుకు తెలియజేయాలని ఆయన తెలిపారు.

పెండింగ్ బిల్లులకు మోక్షం

- వైసీపీ హయాంలో డబ్బులు అందక ఇబ్బందులు పడ్డ కాంట్రాక్టర్లు, రైతులు
- ఉమ్మడి జిల్లాలో రూ.9 కోట్ల బిల్లులు
- త్వరలోనే బ్యాంకు ఖాతాల్లో జమ



కర్నూలు అగ్రికల్చర్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): టీడీపీ హయాంలో 2014-19 కాలంలో రైతులు ఏర్పాటు చేసుకున్న మినీ గోకులాలతో పాటు నీరు-చెట్టు కార్యక్రమం కింద పొలాల్లో తవ్వుకున్న నీటి గుంతలు, వంకలు వాగుల్లో నిర్మించిన చెక్ డ్యామ్‌లు తదితర వాటికి బిల్లులు ఇవ్వలేదు. దీతో రైతులు, కాంట్రాక్టర్లు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రభుత్వాలు మారినా అప్పటి వరకు జరిగిన పనులకు సంబంధించి బకాయిలు చెల్లిస్తేనే కొత్తగా ఎవరైనా తిరిగి ప్రభుత్వ పనులు చేయగలుగుతారు. అయితే.. వైసీపీ ప్రభుత్వం మాత్రం అందుకు విరుద్ధంగా ప్రభుత్వ పనులు చేసిన వారిని మానసిక క్షోభకు గురి చేసింది. అప్పట్లో పనులు పూర్తి చేసిన వారు బిల్లుల కోసం హైకోర్టును కూడా ఆశ్రయించారు. హైకోర్టు ఆదేశాలతో కొంత మేర కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించారు. అయినా కూడా పూర్తి స్థాయిలో బిల్లులు చేతికి అందక వారు కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తూనే ఉన్నారు. 2014-19లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో పెండింగ్ బిల్లుల కోసం రైతులు, కాంట్రాక్టర్లు ఇప్పటికీ కూటమి ప్రభుత్వంలోని పాలకుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. ఉపాధి హామీ పథకం కింద 2014-19 కాలంలో కర్నూలు జిల్లాలో రూ.4 కోట్లు, నంద్యాల జిల్లాలో రూ.5 కోట్లకు సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఎట్టకేలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ బిల్లులను చెల్లించేందుకు అనుమతి ఇచ్చారు. తాజాగా కేంద్రం అనుమతితో క్షేత్ర స్థాయి నుంచి నివేదికలు తెప్పించుకుని మొత్తం పనులు ఆన్‌లైన్ చేశారు. గోకులం షెడ్లు, సీసీ రోడ్లు, డ్రైన్లు, సంపద కేంద్రాలు, వర్మీ కంపోస్టు, వ్యక్తిగత మరుగుదొడ్లు, నీరు-చెట్టు కార్యక్రమం కింద చేపట్టిన పనులకు సంబంధించి బిల్లులు త్వరలోనే రైతులతో పాటు కాంట్రాక్టర్ల బ్యాంకు ఖాతాలకు జమ కానున్నాయి.

పనుల వివరాలు ఆన్‌లైన్ చేశాం



2014-19 కాలంలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులకు సంబంధించి పూర్తి వివరాలను ప్రభుత్వ ఆదేశాలతో ఆన్‌లైన్ చేశాం. ప్రస్తుతం బిల్లులకు సంబంధించి రైతులు, కాంట్రాక్టర్లకు చెల్లించే కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

● వెంకటరమణయ్య, డ్వామా పీడీ, కర్నూలు

సాగునీరు శాపమై..

రుద్రవరం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): రైతులకు సాగునీరు అందితే వారి ఆనందానికి అవధులు ఉండవు. అలాంటి సాగునీరే ఆ రైతుల పాలిట శాపంగా మారింది. పొలాల్లోకి మోతాదుకు మించి నీరు చేరడంతో పంటను సాగుచేయలేక రైతులు అలాగే వదిలేశారు. 22వ గంగ బ్లాక్‌ఛానెల్ నీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో 30ఎకరాల్లో భూమి సాగు చేయకుండా వదిలేశామని టి.లింగందిన్నె, నాగులవరం రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. 22 వ బ్లాక్‌ఛానెల్‌లో నీటి సామర్థ్యం పెరగడంతో పంట పొలాల్లో ప్రవహిస్తున్నాయి. కనీసం ట్రాక్టర్లు, ఎద్దులతో దున్నడానికి కూడా వీలు కాకుండా ఉందని రైతులు పేర్కొంటున్నారు. కళ్లెదుటే సాగునీరు ఉన్నా భూమి సాగు చేసుకోలేకపోతున్నాం. గంగ అధికారులు నిర్లక్ష్యానికి వదిలేశారు. 22వ బ్లాక్‌ఛానెల్ తూము షట్టరు మరమ్మతులు చేయకపోవడమే కారణమని రైతుల వాపోతున్నారు. అధికారులు మాత్రం కాల్వకు నీరు వదిలామని చేతులెత్తేశారు. రైతులు ఎన్నిసార్లు ఇలా చెప్పినా పట్టించుకోవడంలేదన్నారు. అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్లు సాగునీరు ఉన్నా భూమిలో విత్తనం వేయడానికి సాగునీరు అడ్డంకిగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

నీటి సామర్థ్యం తగ్గించాలని..

తెలుగుగంగ అధికారులకు కాల్వలో నీటి సామర్థ్యం తగ్గించాలని ఫిర్యాదు చేశాం. అధికారులు మాత్రం పట్టించుకోలేదు. భూమి సాగు చేసుకోవడానికి వీలు లేకుండా ఉంది.

● వెంకటరమణ, రైతు, టి.లింగందిన్నె

మూడెకరాల భూమిని వదిలేశా..

తెలుగుగంగ 22వ బ్లాక్‌ఛానెల్‌లో అధికంగా సాగునీరు ప్రవహిస్తుంది. తాను మూడు ఎకరాల భూమిని సాగుచేయకుండా వదిలేశా. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు.

● బాలపెద్దయ్య, రైతు, టి.లింగందిన్నె

- గంగ అధికారుల నిర్లక్ష్యం
- సాగుచేయకుండా వదిలేసిన 30 ఎకరాలు
- ఆందోళనలో రైతన్నలు


టి.లింగందిన్నె గ్రామ సమీపంలో పంట పొలాల్లో ప్రవహిస్తున్న గంగ నీరు

ఉప రాష్ట్రపతి అభ్యర్థిని కలిసిన ఎమ్మెల్యే


రాధాకృష్ణన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

ఆదోని, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఎన్‌డీయే ఉప రాష్ట్రపతి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్‌ను శుక్రవారం ఢిల్లీలో ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయన మాట్లాడుతూ బీజేపీ జాతీయ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు లక్ష్మణ్ నేతృత్వంలో పలు రాష్ట్రాలకు చెందిన ఓబీసీ మోర్చా పదాధికారులు ఉప రాష్ట్రపతి అభ్యర్థి రాధాకృష్ణన్‌ను కలిసి సంఘీభావం ప్రకటించామని చెప్పారు. బీసీ సామాజికవర్గానికి చెందిన రాధాకృష్ణను ఎన్డీయే కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా నిలబెట్టడం హర్షణీయమని అన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ బీసీ సామాజికవర్గానికి ప్రాధాన్యం ఇస్తోందని, ఇటీవల రాష్ట్రం నుంచి ఇద్దరు రాజ్యసభ సభ్యులు బీసీలేనని గుర్తు చేశారు. మాటల్లోనే కాదు చేతల్లోనూ బీజేపీ బీసీలకు అవకాశాలు కల్పిస్తోందన్నారు. బీసీలను రాజ్యాధికారులుగా చేయడమే బీజేపీ లక్ష్యమన్నారు.

ఉరుకుంద హుండీ ఆదాయం రూ.1.08 కోట్లు


హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది


కౌతాళం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఉరుకుంద ఈరన్న స్వామి దేవస్థానంలో స్వామి వారికి శ్రావణ మాసం సందర్భంగా పది రోజులకు సంబంధించి భక్తులు సమర్పించిన కానుకలను శుక్రవారం లెక్కించారు. దేవస్థానపు కాలక్షేపపు మండపంలో హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని ఆలయ డిప్యూటీ కమిషనర్, ఈవో వాణి ఆధ్వర్యంలో చేపట్టారు. ఆమె మాట్లాడుతూ భక్తులు స్వామి వారికి సమర్పించిన కానుకలను శుక్రవారం లెక్కింపు కొనసాగగా నగదు రూపంలో రూ.1,08,04,708, బంగారం 1.950 గ్రాములు, వెండి 22.5 కిలోలు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో హుండీ పర్యవేక్షణ అధికారి సుధాకర్‌రెడ్డి, ఆలయ అధికారులు మల్లికార్జున, వెంకటేశ్వరరావు, దేవాలయపు ఉప ప్రధాన అర్చకులు మహదేవప్ప, అర్చకులు నాగరాజు స్వామి, శివన్న స్వామి, బ్యాంకు, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

వాసవీమాతకు కరెన్సీ నోట్లతో అలంకారం



నంద్యాల కల్చరల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): నూనెపల్లె వాసవీ మాత ఆలయంలో అమ్మవారికి కొత్త కరెన్సీ నోట్లతో అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. . కాళికాంబ ఆలయంలో కాళికాంబ అమ్మవారికి, నూనెపల్లె అమ్మవారిశాల లోని వాసవీ మాతకు శ్రావణమాస చివరి శుక్రవారం పూజలు వైభవంగా నిర్వహించారు. కుంకుమార్చనలు, ప్రత్యేకపూజలు చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహిళామండలి , యువజన సంఘం, ఆర్యవైశ్య సంఘం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కామేశ్వరీదేవికి పండ్లతో..


కామేశ్వరీదేవిని పండ్లతో అలంకరించిన దృశ్యం

మహానంది, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలోని కామేశ్వరీదేవి అమ్మవారిని వివిధ రకాల పండ్లతో అలంకరించారు. శుక్రవారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలతో పాటు కుంకుమార్చన పూజలను వేదమంత్రాలతో నిర్వహించారు. అనంతరం వివిధ రకాల పండ్ల అలంకారంతో ఉన్న అమ్మవారిని భక్తులకు దర్శనం ఏర్పాటు చేశారు. వేలాదిమంది భక్తులు మహానంది ఆలయంను దర్శించుకున్నారు. ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు దర్శనం సమయంలో ఎలాంటి ఆటంకాలు లేకుండా చేశారు.

విశ్వసాహితీ కళావేదిక రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ప్రసాద్



నంద్యాల కల్చరల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): విజయవాడ కేంద్రంగా నిర్వహిస్తున్న విశ్వసాహితీ కళావేదికలో నంద్యాలకు చెందిన రచయిత కొప్పుల ప్రసాద్‌ను రాష్ట్ర సహాయ కార్యదర్శిగా నియమించినట్లు ఆకళావేదిక చైర్ పర్సన్ కొల్లి రమావతి తెలిపారు. శుక్రవారం రచయిత్ ప్రసాద్ విలేకరులతో మాట్లాడారు. ఒక ఆశయంతో సాహిత్యాభిలాషతో నిరంతరం సాహిత్య సాంస్కృతిక సమాజ సేవా కార్యక్రమలు చేయాలనే తలంపుతో ప్రారంభించిన జాతీయ స్థాయి సంస్థ విశ్వసాహితీ కళావేదిక అని అన్నారు. ఈ సంస్థలో తనకు స్థానం కల్పించడంతో తనకు ఒక కొత్త బాధ్యతను అప్పగించారన్నారు. రచయిత కొప్పుల ప్రసాద్‌ను నంద్యాలకు చెందిన కవులు, రచయితలు, తెలుగు ఉపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, మహబూబ్ బాషా, డా.నీలం వెంకటేశ్వర్లు, కవి నరేంద్ర, కళారాధన కార్యదర్శి డాక్టర్ రవిక్రిష్ణ, అంతర్జాతీయ శాస్త్రవేత్త డా రవీంద్రనాథ్, కళాకారులు అభినందనలు తెలిపారు.

మహానందిలో నాగుపాము ప్రత్యక్షం


నాగుపామును పట్టుకొన్న స్నేక్ క్యాచర్ మోహన్

మహానంది, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మహానంది ఆలయం ముందు భాగంలోని కరివెన నిత్యాన్నదాన సత్రం పరిసరాల్లో ఎనిమిది అడుగుల నాగుపాము ప్రత్యక్షం అయ్యింది. శుక్రవారం సత్రం ఆవరణలో ఉన్న నాగుపామును చూసిన సిబ్బంది వెంటనే స్నేక్ క్యాచర్ మోహన్‌కు సమాచారమిచ్చారు. ఆయన చాకచక్యంగా నాగుపామును పట్టుకొని సమీపంలోని నల్లమల అడవిలో వదిలారు. వర్షాకాలం కావడంతో పాటు సమీపంలో అడవి ఉండటంతో విషసర్పాల సంచారం మహానంది పరిసరాల్లో ఇటీవల అధికమైంది.

డ్రైవింగ్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు ఎడ్యుకేషన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఎస్సీ యువతకు హెవీ మోటార్స్ వెహికల్స్ డ్రైవింగ్ శిక్షణ కోసం ఆసక్తిగల ఎస్సీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తులసీదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కనీసం ఒక సంవత్సరం కాలపరిమితి గల లైట్ మోటార్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉన్న పురుషులు, మహిళల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 27 చివరి గడువు అని తెలిపారు. ఈ శిక్షణకు పది మంది ఎంపిక చేస్తామని, శిక్షణకు సంబంధించిన ఫీజును కార్పొరేషన్ ద్వారా భరిస్తుందని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు వివరాలకు ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సెల్ నెంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

బిల్లుల కోసం ఎదురుచూపులు

5వ పేజీ తరువాయి

నగరపాలక సంస్థ పరిధిలోని 52 వార్డుల్లో రూ.500కోట్లు పనులు జరిగినట్లు ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలో సాక్షాత్తూ మేయర్ బీవై. రామయ్య చెప్పారు. కర్నూలు-33, పాణ్యం-16, కోడుమూరు-3 వార్డులు వస్తాయి. ఈక్రమంలో ఇప్పటివరకు జరిగిన పనుల్లో నాయకులతో పాటు ప్రజాప్రతినిధులకు కాంట్రాక్టర్లు పర్సెంటేజీలు ఇస్తేనే బిల్లులు జమ అవుతున్నట్లు చెప్పుకుంటున్నారు. గతంలో వైసీపీ నాయకులకు దగ్గరంగా ఉండే కాంట్రాక్టర్ల బిల్లులు, ప్రస్తుతం కూటమి నాయకులకు దగ్గరగా ఉండే కాంట్రాక్టర్ల బిల్లులు మంజూరు అవుతున్నాయి. రూ.500కోట్లకు 5శాతం వేసుకున్న దాదాపు రూ.25కోట్లు వైసీపీ, కూటమి ప్రజాప్రతినిధులకు పర్సెంటేజీల రూపంలో వసూలు చేసినట్లు తెలుస్తోంది.

బిల్లులు కావాలంటే మామూళ్లు..

ప్రభుత్వ ఖాతా నిధి పోర్టల్‌లో బిల్లులు పంపుతారు. అక్కడ ఓకే అయితేనే ప్రభుత్వం మంజూరుచేసి బిల్లులను నేరుగా కాంట్రాక్టర్ల ఖాతాలోకి జమ అవుతాయి. బిల్లులు చేయాలంటే కొందరు అధికారులకు మామూళ్లు ఇచ్చుకోక తప్పదని కొందరు కాంట్రాక్టర్లు బహిరంగంగానే చెబుతున్నారు. ఓ ఏఈకి కాంట్రాక్టర్లు మామూళ్లు ఇవ్వడం లేదని సుమారు 30నుంచి 40 బిల్లులు పెండింగ్‌లో పెట్టినట్లు విశ్వసనీయ సమాచారం. ఆ ఏఈకి ఉన్నతాధికారులు కీలక పనులు అప్పగించారు. దీంతో ఆడిందే ఆట.. పాడింది పాటగా పబ్బం గడుపుకుంటున్నాడు. కాంట్రాక్టర్లు బిల్లుల కోసం కార్యాలయం చుట్టూ చెప్పులు అరిగేలా తిరగాల్సిన పరిస్థితి నెలకొంది.

మంత్రి టీజీ భరత్ చొరవ తీసుకుని..

రాష్ట్ర మంత్రి టీజీ భరత్ చొరవ తీసుకుని నిధి పోర్టల్‌లో అప్‌లోడ్ చేసిన బిల్లులను త్వరితగతిన మంజూరు చేయించాలని కాంట్రాక్టర్లు కోరుతున్నారు. పనులు వేగవంతంగా ముందుకు పోవాలంటే బిల్లులు మంజూరు కావాల్సిందేనని కొందరు భావిస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి నిధి పోర్టల్‌లో అప్‌లోడ్ చేసిన బిల్లులు ఇప్పటి వరకు ఒక్కటి కూడా ఆమోదం పొందకపోవడం ఏమిటని కొందరు ప్రశ్నిస్తున్నారు.

అప్‌లోడ్ చేశాం

ప్రస్తుతం ఎన్ని పనులు చేశారో అన్నింటికి సంబంధించిన బిల్లులను సీఎఫ్‌ఎంఎస్‌లో అప్‌లోడ్ చేశాం. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైన వెంటనే కాంట్రాక్టర్ల ఖాతాలో జమ అవుతాయి. కాంట్రాక్టర్ల వద్ద ఎలాంటి వసూళ్లు చేయలేదు.

- శేషసాయి, ఇన్‌చార్జి ఎస్ఈ, నగరపాలక సంస్థ, కర్నూలు

వ్యక్తి అదృశ్యం


రమేశ్ (ఫైల్)

వెల్దుర్తి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని క్రిష్టాపురం గ్రామానికి చెందిన దేశపోగు రమేశ్(32) అదృశ్యమయ్యాడు. నెల క్రితం కర్నూలుకు వెళుతున్నానని ఇంటి నుంచి బయలుదేరాడు. అప్పటి నుంచి ఇంటికి రాలేదు. దీంతో బంధువులు, చుట్టుపక్కల గ్రామాల్లో వెతికారు. అయినా ఆచూకీ లభ్యం కాలేదు. రమేశ్ తండ్రి నారాయణ ఫిర్యాదు చేశారని ఎస్ఐ అశోక్ తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

ఆదోని రూరల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నగోనేహాళ్ గ్రామానికి చెందిన సుమంగమ్మ చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈనెల 19వ తేదిన కొడుకు బసన్నతో కలిసి ద్విచక్ర వాహనంపై ఆమె ఉరుకుంద ఈరన్నస్వామి దర్శనం కోసం వెళ్లారు. దర్శనం అనంతరం తిరిగి గ్రామానికి వస్తుండగా కడితోట సమీపంలో ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనంపై నుంచి కిందపడ్డారు. తీవ్ర గాయాలైన ఆమెను చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించారు. అయితే చికిత్స పొందుతూ గురువారం అర్ధరాత్రి మృతి చెందినట్లు ఇస్వీ ఎస్ఐ నాయక్ తెలిపారు.

అర్చకుల మధ్య వాగ్వాదం!

- పోలీస్‌స్టేషన్‌కు చేరిన పంచాయితీ
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన

మహానంది, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మహానంది ఆలయంలో అర్చకుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. చివరికి ఈ పంచాయితీ పోలీస్‌స్టేషన్‌కు చేరినట్లు సమాచారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈవిషయం మహానందిలో చర్చాంశనీయంగా మారింది. తమ విధులు పూర్తయ్యాక వేర్వేరుగా మద్యం సేవించిన అర్చకులు ఒకరిని ఒకరు దూషించుకొని బహిరంగంగా వాదులాడుకున్నట్లు తెలిసింది. ఉదయం పోలీసులు స్టేషన్‌కు రప్పించి ఇరువురు అర్చకులను మీరే ఇలా ప్రవర్తిస్తే ఎలా అని సున్నితంగా మందలించి పంపినట్లు సమాచారం. గతంలో కూడా ఇలాంటి సంఘటనలు ఆలయ ఉన్నతాధికారి దృష్టికి రావడంతో ఆయన తీవ్రంగా హెచ్చరించినట్లు తెలిసింది.

కారు దగ్ధం



ఆస్పరి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్తుకూరు బస్టాండ్ సమీపంలో కోడుమూరు నుంచి ఆస్పరి వైపువస్తున్న కారు శుక్రవారం రాత్రి దగ్ధమైంది. కారులో ఆకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో కారును వదిలేసి ప్రాణభయంతో తప్పించుకున్నట్లు డ్రైవర్ సలీంబాషా తెలిపారు. ఘటనాస్థలికి ఆలూరు ఎక్సైజ్ సీఐ లలిత చేరుకొని పరిశీలించారు.

మహిళపై ఆటో డ్రైవర్ అత్యాచారయత్నం

- కేసు నమోదు.. రిమాండుకు తరలింపు

నంద్యాల టౌన్, ఆగస్టు22 (ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణానికి చెందిన ఓ మహిళపై నంద్యాల రైల్వే స్టేషన్‌లో ఆటో డ్రైవర్ అత్యాచారయత్నం చేసినట్లు త్రీటౌన్ సీఐ కంబగిరి రాముడు శుక్రవారం తెలిపారు. సీఐ వివరాల మేరకు.. గురువారం రాత్రి 2 గంటల సమయంలో ఓ మహిళ రైలు దిగి ఆటో కోసం ఆటో డ్రైవర్ సమర సింహంను అడుగగా అతను తన ఆటోలో ఎక్కించుకుని పట్టణ శివారురులో అత్యాచారానికి ప్రయత్నించగా ఆమె తప్పించుకుని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి అతన్ని రిమాండుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

జీఎన్ఎం సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం


కర్నూలు మెడికల్ కాలేజీలో జీఎన్ఎం పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

కర్నూలు హాస్పిటల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మెడికల్ కాలేజీ ఎగ్జామినేషన్ హాలులో జీఎన్ఎం నర్సింగ్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. పరీక్షలకు 13 ప్రభుత్వ, ప్రైవేటు జీఎన్ఎం కాలేజీ విద్యార్థులు హాజరయ్యారు. మొదటి రోజు 346 మంది విద్యార్థులకు గానూ 290 మంది హాజరు కాగా 56 మంది గైర్హాజరయ్యారు. ఈ పరీక్ష కేంద్రాన్ని చీఫ్ ఎగ్జామినర్‌గా సీఎస్ఆర్ఎంవో డాక్టర్ వెంకటరమణ, డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో డాక్టర్ పద్మజ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శివబాల, స్కూల్ ఆఫ్ నర్సింగ్ ప్రిన్సిపాల్ వినోదిని పర్యవేక్షించారు. ఈ పరీక్షలు సెప్టెంబరు 1వ తేదీ వరకు జరగనున్నాయి. గత ఏడాది జరిగిన నర్సింగ్ విద్యార్థుల పరీక్షలకు, మినిస్టీరియల్ స్టాఫ్‌ను ఇన్విజిలేటర్లుగా నియమించడంతో కాపీయింగ్‌కు పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈసారి కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రత్యేక చొరవతో ముగ్గురు మెడికల్ ఆఫీసర్లు, 14 మంది హెడ్ నర్సులు, స్టాఫ్ నర్సులను ఇన్విజిలేటర్లుగా నియమించి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు.

అధికారులపై దాడులు హేయం

- వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి


ఎస్పీకి వినతి పత్రం అందజేస్తున్న వైసీపీ నాయకులు

నంద్యాల రూరల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో టీడీపీ నాయకులు అధికారులపై దాడులు చేయడం హేయమైన చర్య అని వైసీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక వైసీపీ కార్యాలయంలో జిల్లాలోని మాజీ ఎమ్మెల్యేలతో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండు తెలుగు రాష్ట్రాల్లో శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి అటవీ శాఖ అధికారులపై దాడి చేయడం హల్‌చల్‌గా మారిందన్నారు. పార్టీకి చెందిన ఎమ్మెల్యే అయిన సీఎం, డీప్యూటీ సీఎం కేసు నమోదు చేయమనడం బూటకన్నారు. ఎమ్మెల్యేపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని డిమాండు చేశారు. అంతే కాకుండా జిల్లాలో యూరియా కొరత కూడా టీడీపీ నాయకుల వల్లే ఏర్పడుతోందన్నారు. టీడీపీ నాయకులు వారికి నచ్చినట్లు లారీల లోడును తరలించడం మంచిదికాదన్నారు. దీంతో సామాన్య రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. అలాగే ఈ ఎమ్మెల్యే అనుచరులే గతంలో కూడా ఏరాసు ప్రతాప్‌రెడ్డిపై దాడికి పాల్పడ్డారన్నారు. బీసీ జనార్దన్‌రెడ్డి సోదరుడు ఏఆర్ కానిస్టేబుల్‌పై దాడి చేయడం ఏమిటని ప్రశ్నించారు. అనంతరం ఎస్పీ, డీఆర్వోకు వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు కాటసాని రామిరెడ్డి, శిల్పా చక్రపాణి రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

గ్రేడింగ్ విధానాన్ని కొనసాగించాలి

- మార్కెట్‌యార్డు కార్యాలయాన్ని ముట్టడించిన మహిళా కూలీలు
- గ్రేడింగ్ వల్ల రైతులు నష్టపోతారు
- లైసెన్స్ లేని కూలీలు ఆందోళన చేస్తే ఉపేక్షించం
- కార్యదర్శి కల్పన హెచ్చరిక


మార్కెట్‌యార్డు కార్యాలయాన్ని ముట్టడించిన కూలీలు

ఆదోని అగ్రికల్చర్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మార్కెట్ యార్డ్‌లో గ్రేడింగ్ విధానాన్ని కొనసాగించాలంటూ మహిళా కూలీలు డిమాండ్ చేశారు. పట్టణంలోని మార్కెట్‌యార్డు కార్యాలయాన్ని శుక్రవారం ముట్టడించారు. వారు మాట్లాడుతూ ఈనెల 25 నుంచి రైతులు విక్రయానికి తెచ్చిన వేరుశనగ దిగుబడులకు పాసింగ్ విధానం లేకుండా కొనుగోలు చేయాల్సిందేనని మార్కెట్ యార్డ్ కార్యదర్శి ఎం. కల్పన వ్యాపారులను ఆదేశించారు. రైతులకు నష్టం కలిగించే విధానాన్ని మార్కెట్ యార్డ్‌లో అమలు చేస్తే ఊరుకోమని హెచ్చరించారు. వ్యాపారుల దగ్గర పనిచేస్తూ గ్రేడింగ్ చేస్తున్న మహిళా కూలీలను కొందరు రెచ్చగొట్టి కార్యాలయం వైపు ఉసిగొల్పినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో 250 మందిపైగా మహిళా కూలీలు మార్కెట్ కమిటీ కార్యాలయాన్ని ముట్టడించి అక్కడే బైఠాయించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే తాము ఎంతటి వారినైనా ఉపేక్షించబోమని యార్డు అధికారులు హెచ్చరించారు. గ్రేడింగ్ విధానాన్ని రద్దు చేస్తే తమకు ఉపాధి కోల్పోతామని, ఎన్నో ఏళ్ల నుంచి మార్కెట్ యార్డ్ పైనే జీవనం చేస్తున్నామంటూ చెప్పుకొచ్చారు. ఇది వేరుశనగ వ్యాపారులకు, మీకు సంబంధించినదని, లైసెన్స్ కలిగిన కూలీలు కానప్పుడు ఇక్కడ ఆందోళన చేయవద్దంటూ సూచించారు. మధ్యాహ్నం రెండు గంటల వరకు కమిషన్ ఏజెంట్ల దుకాణాల వద్దకు వెళ్లకుండా తూకాలు నిలుపుదల చేయడంతో ఒకటో పట్టణ పోలీసులు అక్కడ చేరుకొని వారికి సర్దిచెప్పారు. రైతులకు నష్టం కలిగించే విధానం అని, వ్యాపారులతో మీరు మాట్లాడుకోవాలని అక్కడి నుంచి పంపించేశారు. వ్యాపారులు మాత్రం పాసింగ్ కొనసాగిస్తేనే వేరుశనగ దిగుబడును కొనుగోలు చేస్తామని చెబుతున్నారు. పాసింగ్ విధానం రద్దు చేస్తారా? కొనసాగిస్తారా? అన్న దానిపై సందేహాలు వ్యక్త అవుతున్నాయి. మార్కెట్ యార్డ్ కార్యదర్శి కల్పన మాట్లాడుతూ మహిళా కూలీలు వచ్చి ఇక్కడ ఆందోళన చేస్తే ఉపేక్షించబోమని, వారు లైసెన్స్ దారులు కాదని చెప్పారు. వ్యాపారులతో మాట్లాడుకోవాలని సూచించారు.

మత్తు మందులు అడిగితే సమాచారమివ్వండి

- నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తే చర్యలు
- భవిష్యత్తులో 'గరుడ 2.0'
- అడిషనల్ ఎస్పీ యుగంధర్‌బాబు


బ్రోచర్‌ను విడుదల చేస్తున్న ముఖ్య అతిథులు

నంద్యాల హాస్పిటల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): యువత మెడికల్ షాపుల్లో మత్తు ఇచ్చే మందులు అడిగితే వారి వివరాలు పోలీసులకు తెలపాలని నంద్యాల అడిషనల్ ఎస్పీ యుగంధర్‌బాబు అన్నారు. శుక్రవారం పట్టణంలోని తేజస్విని హోటల్ కాన్ఫరెన్స్ హాల్‌లో నంద్యాల డ్రగ్ ఇన్‌స్పెక్టర్ హనుమన్న ఆధ్వర్యంలో నార్కోటిక్ డ్రగ్స్, యాంటీ బయాటిక్స్ వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ పోలీస్‌లు, ఈగల్‌టీం ఎప్పటికప్పుడు నిఘా ఉంచి మత్తు పదార్థాలపై గమనిస్తుంటుందన్నారు. మెడికల్ షాప్ యజమానులు డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా పేషెంట్లకు ఎలాంటి ఎన్ఆర్ఎక్స్ మందులు ఇవ్వద్దన్నారు. ఈగల్ ఐజీపీ ఆర్కే రవికృష్ణ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా వంద టీమ్‌లతో ఆపరేషన్ గరుడ అనే పేరుతో మెడికల్ షాప్‌లపై దాడులు నిర్వహించారన్నారు. అందులో భాగంగా నంద్యాల జిల్లాలో దాదాపు 10 మెడికల్ షాప్‌లపై దాడులు నిర్వహించి ఎన్ఆర్ఎక్స్ మందుల అమ్మకం, హెచ్1రిజిష్టర్, ఓటీసీ సేల్స్ మరికొన్ని నిబంధనలకు విరుద్దంగా విక్రయించినట్లు తేలడంతో కేసులు నమోదు చేశామన్నారు. భవిష్యత్‌లో ఆపరేషన్ గరుడ 2.0 ఉంటుందని అప్పట్లోగా మెడికల్ షాప్‌ల యజమానులు వ్యాపార దృష్ట్యా కాకుండా సమాజంపైన బాధ్యతగా ఉండి జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వెంకటరమణ, డ్రగ్స్ శాఖ ఏడీ రమాదేవి, కర్నూలు డ్రగ్ ఇన్‌స్పెక్టర్ జయరాముడు, నంద్యాల జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు దామోదరరెడ్డి, ఈగల్‌టీం సిబ్బంది, జిల్లాలోని మెడికల్ ఏజెన్సీ, షాపుల యజమానులు పాల్గొన్నారు.

సాగుకు యోగ్యంకాని భూములిచ్చారు..

- రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసిన లబ్ధిదారులు
- విచారణ చేపట్టిన డోన్ ఆర్డీవో, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ


జమ్ములదిన్నెలో భూములను పరిశీలిస్తున్న ఆర్డీవో నరసింహులు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తులసీదేవి, సిబ్బంది

బనగానపల్లె, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఎస్సీలకు ఇచ్చిన భూములు సాగుకు పనికిరావని లబ్ధిదారులు పేర్కొన్నారు. దీనిపై ఎనిమిది లబ్ధిదారులు ఇటీవలే జిల్లా రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం డోన్ ఆర్డీవో నరసింహులు ఆధ్వర్యంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తులసీదేవి, తహసీల్దార్ విచారణ చేపట్టారు. బాధితులు తెలిపిన వివరాలు.. 2016-17లో 12మంది ఎస్సీ లబ్ధిదారులకు భూమి కొనుగోలు పథకం కింద మండలంలోని జమ్ములదిన్నె గ్రామంలో భూమి కొనుగోలు చేసి ఎస్సీలకు పట్టాలిచ్చారు. సాగుకు పనికిరాని భూములు తమకు అంట గట్టారంటూ ఎనిమిది మంది లబ్ధిదారులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అధికారులు విచారణ చేపట్టారు. తహసీల్దారు నారాయణరెడ్డి మాట్లాడుతూ అప్పటి రెవెన్యూ అధికారులు భూమి కొనుగోలు పథకం కింద 12 మందికి పట్టాలు ఇచ్చారన్నారు. కొంతమంది లబ్ధిదారులకు భూముల విషయంపై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా భూములను పరిశీలించామన్నారు. నివేదికను కలెక్టర్‌కు సమర్పిస్తామని తెలిపారు.

అప్పట్లోనే దుమారం..

2016-17 సంవత్సరంలో ఎస్సీలకు భూమి కొనుగోలు పథకంలో భాగంగా ఇచ్చిన భూముల విషయంలో భారీగా అక్రమాలు జరిగినట్లు విమర్శలు వచ్చాయి. మధ్య దళారీలు ఎస్సీ కార్పొరేషన్ అధికారులతో కుమ్మక్కయినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. జమ్ములదిన్నె గ్రామంలో సాగుకు పనికి రాని భూములను కొనుగోలు చేసి దళారులు, ఎస్సీ కార్పొరేషన్ అధికారుల, బనగానపల్లె స్థానిక రెవిన్యూ అధికారులు కుమ్మక్కై ఈభూములను లబ్ధిదారులకు అందజేసినట్లు ఆరోపణలున్నాయి. ఎకరా రూ.10వేలు కూడా విలువ చేయని సాగుకు పనికిరాని భూములను దళారులు ఎకరా రూ.6 లక్షలకు ఎస్సీ భూమి కొనుగోలు పథకం కింద ప్రభుత్వానికి అమ్మి ఆసొమ్మును దళారులు అప్పటి రెవెన్యూ, ఎస్సీ కార్పొరేషన్ అధికారులు స్వాహా చేసినట్లు ఆరోపణలు వెల్లివిరిశాయి.

కుక్కల దాడిలో 150 గొర్రె పిల్లల మృతి

- రూ. 1.50 లక్షల నష్టం

బేతంచెర్ల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): బేతంచెర్ల- డోన్ రోడ్డులో ముచ్చట్లు వాగు వద్ద గొర్రెలదొడ్డిలో శుక్రవారం రాత్రి గొర్రె పిల్లలపై కుక్కలు దాడి చేశాయి. ఈ దాడిలో 150 గొర్రె పిల్లలు మృత్యువాత పడ్డాయి. దీంతో రూ.1.50 లక్షల నష్టం వాటిల్లిందని బాధితులు వాపోయారు. రంగాపురం గ్రామానికి చెందిన గోపాలు, సిద్దయ్య, బాలబుడ్డి అనే గొర్రెల కాపరులు మేకలకు ముచ్చట్ల వాగు వద్ద గొర్రెలదొడ్డి ఏర్పాటు చేసుకున్నారు. అయితే గుర్తు తెలియని వ్యక్తి ఒక గొర్రె పిల్లను దొంగతనం చేసేందుకు కల్లందొడ్డి తెరిచి వెళ్లాడు. దాంతో కుక్కలు దొడ్డిలోకి వెళ్లి మేకపిల్లలపై దాడి చేసి 150 గొర్రెపిల్లలను చంపాయని బాధితులు వాపోయారు. ముగ్గురు గొర్రెల కాపరులకు చెందిన 50 చొప్పున 150 గొర్రె పిల్లలను నష్టపోయామని కన్నీరుమున్నీరై విలపించారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

దివ్యాంగుల పింఛన్లను పునరుద్ధరించాలి

నంద్యాల డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహ యాదవ్


మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహ యాదవ్

నంద్యాల రూరల్ ఆగస్టు, 22(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల పింఛన్లను పునరుద్ధరించాలని నంద్యాల డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహ యాదవ్ అన్నారు. శుక్రవారం ఆ పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చాలా మంది అర్హులైన వారికి కూడా పింఛన్ తీసేయడం బాధకరమన్నారు. దీంతో వారు భయాందోళనకు గుర వుతున్నారన్నారు. రీ వెరిఫికేషన్ చేయించుకోవడానికి దూరం ప్రాంతాల నుంచి రావాలంగే ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి ఇబ్బందులు కలుగకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రజాక్ హుసేన్, ధనుంజయ్, రమణ తదితరులు పాల్గొన్నారు.

కొండెక్కిన కొబ్బరి బోండం

- ధర రూ.50 నుంచి రూ.70 వరకు పలుకుతున్నవైనం
- పెరిగిన కొబ్బరి నూనె రేటు



కొలిమిగుండ్ల, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): కొబ్బరి బోండం ధరలు కొండెక్కాయి. ఒక్కో కొబ్బరి బోండం ధర సైజును బట్టి రూ.50 నుంచి రూ.70కి పైగా పలుకుతుండటంతో సామాన్య మధ్యతరగతి ప్రజలు కొనలేని పరిస్థితి నెలకొంది. గతంలో రూ.25, 30 ఉన్న కొబ్బరి బోండం ధరలు గత కొన్ని నెలలుగా పెరుగుతూ వచ్చాయి. ప్రస్తుతం రూ.70కి చేరుకొని సామాన్యులకు అందనంత ఎత్తుకు చేరుకున్నాయి. సహజంగా అనారోగ్యానికి గురైన వారు కొబ్బరి బోండం తాగడానికి ఇష్టపడటంతో పాటు, వైద్యులు కూడా కొబ్బరి బోండం నీరు తాగాలని సూచిస్తున్నారు. ఇటీవల జోరుగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. దీంతో రోగాలబారిన పడుతున్న సామాన్యులు కొబ్బరి బొండం కొనాలంటే భయపడిపోయే పరిస్థితి నెలకొంది. కొబ్బరి బోండం ధరలు పెరగడానికి ఆంధ్రప్రదేశ్‌తో పాటు, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో దిగుబడి తగ్గడమే ప్రధాన కారణమని వ్యాపార వర్గాలు పేర్కొంటున్నాయి. అనేక ప్రాంతాల్లో 30నుండి 40 శాతం వరకు దిగుబడి పడిపోవడంతో, డిమాండ్ తగ్గ ఉత్పత్తిలేక ధరలు అమాంతం పెరుగుతున్నట్లు తెలుస్తోంది.

అదే దారిలోనే కొబ్బరి నూనె రేటు

అన్నివర్గాల ప్రజలు అత్యధికంగా వినియోగించే కొబ్బరి నూనె ధరలు అదే పంతాలో నడుస్తున్నారు. గడిచిన కొద్ది నెలల వ్యవధిలోనే 30 శాతానికి పైగా కొబ్బరి నూనె ధరలు పెరిగినట్లు వినియోగదారులు వాపోతున్నారు. గతంలో 500 ఎంఎల్ కొబ్బరి నూనె బాటిల్ ధర రూ.230 ఉండగా, ప్రస్తుతం రూ.300కు చేరింది. వివిధ కంపనీలను బట్టి ధరల్లో కొంతమేర వ్యత్యాసం కనిపిస్తోంది. దీంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ధరల నియంత్రణపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

క్యాన్సర్ నివారణపై అవగాహన ఉండాలి

- కర్నూలు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ చిట్టినరసమ్మ



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ చిట్టినరసమ్మ

కర్నూలు హాస్పిటల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ నివారణపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ సూచించారు. కర్నూలు మెడికల్ కాలేజీ న్యూ ఆడిటోరియంలో ఎన్‌సీడీ-4.0 క్యాన్సర్ వ్యాధి నివారణపై అర్బన్ హెల్త్ సెంటర్ల మెడికల్ ఆఫీసర్లకు శిక్షణ కార్యక్రమాన్ని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.శాంతికళ అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన ప్రిన్సిపాల్ మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధి బారిన పడకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కర్నూలు స్టేట్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణప్రకాష్ మాట్లాడుతూ క్యాన్సర్‌ను ప్రారంభ దశలో గుర్తించాలని, స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్‌లో ప్రతి మంగళవారం, గురువారం ఓపీ నెంబర్ 222కు కేసులను పంపాలని సూచించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధిపై ఎన్నో అపోహలు ఉన్నాయని, వాటన్నింటిపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మానవ శరీరంలో గోళ్లకు, వెంట్రుకలకు తప్ప శరీరంలోని అన్ని భాగాలకు క్యాన్సర్ సోకే ప్రమాదం ఉందన్నారు. ఆర్‌బీఎస్‌కే జిల్లా కోఆర్డినేటర్ డా.మహేశ్వర ప్రసాద్ మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధిని రోగులను గుర్తించి మెరుగైన వైద్యసేవలు అందించడానికి ఈ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో సంచార చికిత్స కార్యక్రమ జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ రఘు, డిప్యూటీ డెమో చంద్రశేఖర్ రెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ పద్మావతి, ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ సుధాకర్, ఎన్‌సీడీ ఎపిడమాలజిస్టు వేణుగోపాల్, ప్రొజెక్టనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.



నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

యూరియాపై రైతులకు అవగాహన కల్పించాలి

● రైతులు ఆందోళన చెందొద్దు ● కలెక్టర్ రాజకుమారి

నంద్యాల ఎడ్యుకేషన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): యూరియాపై వ్యవసాయాధికారులు రైతులకు పూర్తిగా అవగాహన కల్పించాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. అమరావతి సచివాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ శుక్రవారం అన్ని జిల్లాల కలెక్టర్‌లు, వ్యవసాయాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీసీ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రైతులు యూరియా విషయంలో ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అవసరానికి మించి ఎరువులు అందుబాటులో ఉన్నాయని భరోసా ఇచ్చారు. గత ఖరీఫ్ సీజన్ కంటే ఈ ఏడాది ఎరువులను ఎక్కువగా సరఫరా చేశామని, రైతులు అపోహలతో యూరియాను అధికంగా కొనుగోలు చేసి నిల్వ ఉంచుతున్నారన్నారు. ఈ మేరకు రైతులకు వ్యవసాయాధికారులు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. క్షేత్రస్థాయిలో యూరియా, ఎరువుల కొరత లేకుండా విజిలెన్స్ అధికారులు నిఘా పెట్టాలన్నారు. 2025 ఖరీఫ్ సీజన్‌లో ఎరువుల వినియోగం గణనీయంగా పెరిగిందన్నారు. రైతులకు మరింత భరోసా కల్పించేలా మార్క్‌ఫెడ్‌కు 50 నుంచి 70శాతం ఎరువుల కేటాయింపులను పెంచామన్నారు. ఎరువులు బ్లాక్ మార్కెట్‌కు తరలించినా, కృత్రిమ కొరత సృష్టించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, జేసీ

యూరియా గోల్‌మాల్‌పై విచారణ

గోస్పాడు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పసురపాడు ఆర్‌ఎస్‌కే రైతు సేవా కేంద్రానికి రావాల్సిన 12 టన్నుల యూరియా గోల్‌మాల్ అయిందనే విషయంపై శుక్రవారం అధికారులు విచారణ చేపట్టారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆళ్లగడ్డ ఏడీఏ విజయశేఖర్, ఏవో స్వప్నిక పసురపాడు ఆర్‌ఎస్‌కేలో విచారణ చేశారు. హార్టికల్చర్ అసిస్టెంట్ శ్రీకాంత్‌రెడ్డిని యూరియా విషయంపై ప్రశ్నించగా 12 టన్నుల యూరియాను నంద్యాలలోని టీడీపీ నాయకుడి గోడౌన్‌లో ఉంచి పసురపాడు రైతులకే పంపిణీ చేశామని, ఎక్కడా అవకతవకలకు పాల్పడలేదని పేర్కొన్నారు. యూరియా కొరత ఉండటంతో రైతులు, రాజకీయ నాయకుల ఒత్తిడి తట్టుకోలేకనే పొన్నాపురంలోని గోడౌన్‌లో దించానని రాతపూర్వకంగా సమాధానం ఇచ్చారు. రైతులను విచారించగా కొంతమందికి మాత్రమే యూరియా ఇచ్చినట్లు తెలిపారు. ఇప్పటివరకు 24 టన్నుల యూరియా రాగా పసురపాడు గ్రామంలో మొదటిసారి ఇచ్చిన రైతులకే మళ్లీ పంపిణీ చేశాడని రైతులు అధికారులకు తెలిపారు. తమకు ఒక్క బస్తా కూడా అందలేదని పసురపాడు గ్రామ రైతులు ఆరోపించారు.



విచారణ చేపడుతున్న ఏడీఏ, ఏవో

ప్రకటనలు కాదు.. యూరియా ఎక్కడుందో చెప్పాలి

● రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్

కొత్తపల్లి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రకటనలు ఇవ్వడం కాదు.. యూరియా ఎక్కడుందో రైతులకు తెలపాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్, మండల నాయకులు గంగన్న అన్నారు. శుక్రవారం మండలంలోని పెద్దగుమ్మడాపురం గ్రామంలో రైతులు ఏర్పాటు చేసుకున్న సమావేశంలో రాజశేఖర్ మాట్లాడారు. వ్యవసాయాధికారులు కావాల్సినంత యూరియా ఉంది. ఎవరూ ఇబ్బందులు పడాల్సిన అవసరం లేదని ప్రకటనలు గుప్పిస్తున్నారని, యూరియా ఎక్కడ దాచారో చెప్పాలని డిమాండ్ చేశారు. యూరియా లేక రైతులు వ్యవసాయ కార్యాలయాలు, సహకార సొసైటీలు, మనగ్రోమోర్‌ల వద్ద పడిగాపులు కాస్తున్నారని పేర్కొన్నారు. మండలంలో అధికంగా వేలాది హెక్టార్లలో మొక్కజొన్న సాగు చేశారని, రైతులకు అవసరమైన మేరకు యూరియా సరఫరా చేయడంలో ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాఖ విఫలమైందన్నారు. అధిక వర్షాల వల్ల మొక్కజొన్న పంటలు ఎర్రబారుతున్నాయని, దీంతో రైతులకు యూరియా అవసరం ఎక్కువగా ఉంటుందన్నారు. రైతులకు యూరియా అందించాలని, లేనిపక్షంలో రైతులతో కలిసి ధర్నా చేస్తామని హెచ్చరించారు.



మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్

రైతు సంఘం గ్రామ కమిటీ ఎన్నిక

పెద్దగుమ్మడాపురంలో ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, మండల నాయకులు గంగన్న ఆధ్వర్యంలో గ్రామ రైతు కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ కమిటి అధ్యక్షుడిగా శ్రీరాములు, ఉపాధ్యక్షులుగా మహేశ్వరరెడ్డి, శ్రీను, కార్యదర్శిగా వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి గా చాబోలు రాజు, గుర్రం రాజు, కోశాధికారిగా వెంకన్నతో పాటు కమిటి సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పోలీసు సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యం

● ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా



మాట్లాడుతున్న ఎస్పీ

నంద్యాల టౌన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి, వారి సంక్షే మానికి అధిక ప్రాధాన్యత ఇస్తామని ఎస్పీ అదిరాజ్ సింగ్ రాణా తెలిపారు. శుక్ర వారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు సిబ్బందికి గ్రీవెన్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎవరికైనా ఎటువంటి సమస్యలు ఉన్నా నిర్భయంగా తెలియజేస్తే వాటిని పరిష్కరించి సమస్య లేకుండా చేస్తామన్నారు. దీంతో ఇబ్బందులు పడ కుండా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. 12 మంది మ్యూచ్యువల్ ట్రాన్స్‌ఫర్‌లు, మెడికల్ గ్రౌండ్స్, రిక్వెస్ట్ బదిలీల సమస్యలు విన్నవించగా వాటిని త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా పోలీసు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం

నంద్యాల కల్చరల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): శ్రీశైల దేవస్థానంలోని శాశ్వత అన్నప్రసాద పథకానికి డోన్‌కు చెందిన శ్రీరాజ విజయకుమార్ దంపతులు రూ.లక్ష విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి సతీష్ మల్లిక్, పర్యవేక్షకులు దేవిక శ్రీరాజ విజయకుమార్ దంపతులకు రశీదు, ప్రసాదాలు, శేషవస్త్రం అందజేశారు.

పనుల్లో నాణ్యత పాటించండి

పాణ్యం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తూరు దేవస్థాన పరిధిలోని శివాలయ పునర్నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని రాష్ట్ర దేవాదాయ శాఖ అధికార స్థపతి పరమేశ్వరప్ప ఆదేశించారు. శుక్రవారం ఆలయ నిర్మాణ పనులను ఆయనతోపాటు డీఈఈ సీహెచ్ శ్రీనివాసులు, ఏఈ కిరణ్ పరిశీలించారు. రూ. కోటి 25 లక్షల సీజీఎఫ్ నిధులతో చేపట్టిన పునర్నిర్మాణ పనులు వేగవంతంగా జరగాలన్నారు. ఈవో రామకృష్ణ, అసిస్టెంట్ స్థపతి సుబ్రహ్మణ్యం, ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి, నాగేశ్వరరావు, గ్రామ పెద్దలు మిలిటరీ సుబ్బారెడ్డి, ఏఎస్ఐ రఫీక్, అర్చకులు పాల్గొన్నారు.

పైపాలెం గ్రామానికి వీధి లైట్ల పంపిణీ

మిడుతూరు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మిడుతూరు మండల పరిధిలోని పైపాలెం గ్రామానికి గ్రీన్‌కో సోలార్ నిర్వాహకులు వివేక్ రాజ్ ఆధ్వర్యంలో శుక్రవారం వీధిలైట్లను పంపిణీ చేశారు. తహసీల్దార్ శ్రీనివాసులు, గ్రామసర్పంచు రామచంద్రుడుకి వీధిలైట్లను అందజేశారు. ఆదేవిధంగా గ్రామంలో రోడ్లు, పాఠశాల భవనానికి పెయింటు, ఆర్‌వో ప్లాంటు, శ్మశానవాటికకు ప్రహరీ, ఆశ్రమం వద్ద సోలార్ వీధి లైట్లు, డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేయనున్నట్లు సోలార్ నిర్వాహకులు వివేక్‌రాజ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సూర్యతేజ, శివప్రసాద్, గణేష్, గ్రామ నాయకులు నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి షేక్‌షావలి, వీఆర్‌వో సుందర్‌రాజ్ పాల్గొన్నారు.

మెక్కజొన్నలో నీరు అధికంగా ఉంచకూడదు

మహానంది, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): రైతులు మెక్కజొన్న పంటలో నీరు అధికంగా ఉంచకూడదని మండల వ్యవసాయాధికారి బి.నాగేశ్వరరెడ్డి తెలిపారు. శుక్రవారం మహానంది మండలం మసీదుపురం పంట పొలాల్లో మెక్కజొన్న సాగును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వీఏఏ భారతి, రైతులు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్త మృతి

జూపాడుబంగ్లా, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): జూపాడుబంగ్లా ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో పనిచేసే ఆశా కార్యకర్త పార్వతి అనారోగ్యంగా బాధపడుతూ శుక్రవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య ఆమె మృత దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె కుటుంబ సభ్యుల ను పరామర్శించారు. ప్రభుత్వం ద్వారా సాయం అందిస్తామని భరోసా ఇచ్చారు. నివాళులర్పించిన వారిలో టీడీపీ నాయకులు రవికుమార్ యాదవ్, సుధాకర్, పెద్దన్న తదితరులు ఉన్నారు.

సైబర్ నేరగాళ్ల వలలో పడి మోసపోవద్దు

● సైబర్ క్రైం సీఐ వంశీధర్



మాట్లాడుతున్న సీఐ వంశీధర్

నంద్యాల టౌన్, ఆగస్టు 22(ఆంధ్ర జ్యోతి): యువత సైబర్ నేరగాళ్ల వలలో పడి మోసపోవద్దని సైబర్ క్రైం సీఐ వంశీధర్ విద్యార్థులకు సూచించారు. శుక్రవారం స్థానిక రామకృష్ణ డిగ్రీ కళాశాలలో సైబర్ క్రైంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్పీ ఆదేశాలతో ఎక్కడ సైబర్ క్రైం జరిగినా వెంటనే బ్యాంకులతో అనుసంధానం చేసుకుని వారి ఆకౌంటు నుంచి మిగిలిన మొత్తాన్ని సైబర్ నేరగాళ్లు దోచుకోకుండా ఆపడానికి ప్రయత్ని స్తున్నామన్నారు. అలాగే క్యూఆర్ కోడ్ స్కాన్ చేసే సమయంలో కూడా యువత తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. అలాగే ఆన్‌లైన్ గేం, ఆన్‌లైన్ లావాదేవీలు చేసే సమయంలో కూడా తప్పకుండా తగు జాగ్రత్తలు అవసరమని సూచించారు.

వాసవీ క్లబ్ అధ్యక్షుడిగా సంజీవరాయ ప్రసాద్



ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న సంజీవరాయ ప్రసాద్

వెలుగోడు ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): వాసవీ క్లబ్ అధ్యక్షుడిగా సంజీవరాయప్రసాద్‌ను శుక్రవారం ఎన్నుకున్నారు. స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆర్యవైశ్యులు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సెక్రటరీగా గోపాల్, ట్రెజరర్‌గా కళ్యాణిలకు ఐఈసీ ఆఫీసర్ భూమా సూర్యనారాయణ, గవర్నర్ కందుకూరు రామసుబ్బయ్య, రీజనల్ చైర్మన్ నాగశైలజ ధ్రువపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాసవీ కుటుంబ సురక్ష పథకంలో సభ్యత్వం తీసుకున్న వ్యక్తి మృతి చెందితే.. వారి కుటుంబానికి రూ.5లక్షలు అందజేస్తామన్నారు. ఆర్యవైశ్యుల అభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాల గురించి వివరించారు. సుధాకర్, ప్రసాద్, నాగేంద్ర, రమణయ్య, ప్రభాకర్, శ్రీనివాసులు, సత్యనారాయణ పాల్గొన్నారు.

శ్రీశైలంలో అభివృద్ధిని అడ్డుకుంటున్నారు: టీడీపీ

నంద్యాల ఎడ్యుకేషన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలంలో చేపడుతున్న అభివృద్ధి పనులను అడ్డుకుంటూ అటవీశాఖ అధికారులు ఎమ్మెల్యే బుడ్డారాజశేఖర్‌రెడ్డిపై ఆరోపణలు చేస్తున్నారని టీడీపీ శ్రీశైలం మండల నాయకులు అన్నారు. శుక్రవారం శ్రీశైలంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆ పార్టీ నాయకులు శ్రీనివాసరెడ్డి, సురేష్ మాట్లాడుతూ శ్రీశైలంలో జరిగిన అభివృద్ధి పనులు చూపించేందుకు ఎమ్మెల్యే అటవీశాఖ సిబ్బందిని వెంటపెట్టుకెళ్లారని, దానిపై రాద్ధాంతం చేయడం ఏమాత్రం సబబు కాదన్నారు. శ్రీశైలం పరిధిలో అటవీశాఖ అధికారులు, సిబ్బందిపై సమగ్ర విచారణ చేపడితే నిజాలు బయటపడతాయని వారు వివరించారు.

మహిళల రక్షణకు 'శక్తి' యాప్

మహానంది, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మహిళల భద్రతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన శక్తి యాప్ ఒక రక్షణ కవచంలా ఉపయోగపడుతుందని నంద్యాల శక్తి టీం హెడ్ కానిస్టేబుళ్లు ప్రసాద్, రఫి, వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం మహానంది మండలం ఎం.తిమ్మాపురం జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు శక్తి టీం సభ్యులు సైబర్ నేరాలు, బాల్యవివాహాల నివారణపై అవగాహన కల్పించారు.

నిధులు మంజూరు చేయాలి

● సీఎంను కలిసిన ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి



పాణ్యం సమస్యలను ముఖ్యమంత్రికి వివరిస్తున్న గౌరు చరిత

పాణ్యం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): పాణ్యం అభివృద్ధికి నిధులను మంజూరు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని కోరినట్లు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ అమరావతి సచివాలయంలో ముఖ్య మంత్రిని కలిసి పాణ్యం అభివృద్ధిలో భాగంగా గోరుకల్లు రిజర్వాయర్‌కు నిధులు మంజూరు చేయడంపై సీఎంకు కృతజ్ఞతలు తెలిపామన్నారు. ఈ సంద ర్భంగా నియోజకవర్గంలోని ప్రధాన సమపస్యలపై చర్చించినట్లు తెలిపారు. అలగనూరు రిజర్వాయర్ మరమ్మతులకు, కల్లూరు అర్బన్ 16వ వార్డులకు ప్రకటించిన రూ.50 కోట్ల నిధులను వెంటనే విడుదల చేయాలని కోరామన్నారు. ఓర్వకల్లు ఇండస్ట్రియల్ పార్క్‌లో డ్రోన్, సెమి కండక్టర్, ఈవీ పరిశ్రమల ఏర్పాటుకు సహకారం అందించాలని వినతిపత్రం అందజేశామ న్నారు. దీనిపై సీఎం సానుకూలం గా స్పందించినట్లు తెలిపారు.

లోతట్టు కాలనీల్లో రోడ్లు నిర్మించాలి



అర్బన్ కాలనీలో పర్యటిస్తున్న సీపీఎం నాయకులు

ఆత్మకూరు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణంలోని లోతట్టు కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలను చేపట్టాలని సీపీఎం నాయకులు రణధీర్, సురేంద్ర, రామ్‌నాయక్, ఇస్మాయిల్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం వారు పలు కాలనీలను సందర్శించి అక్కడి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో పట్టణంలోని అనేక కాలనీలు చేపల చెరువులను తలపిస్తున్నాయన్నారు. ఆయా కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టాలని అన్నారు. లేనిపక్షంలో ప్రజలతో కలిసి మున్సిప ల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు మహ్మద్ తదితరులు ఉన్నారు.

ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం

ఆత్మకూరు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సంస్థల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం, ఆత్మకూరు పట్టణ అధ్యక్షుడు సద్దాం, కార్యదర్శి రామ్ నాయక్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా స్థానిక సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. మూడు దశాబ్దాలుగా కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులు విద్యుత్ శాఖలో తక్కువ వేతనాలు తీసుకుం టూ ఎక్కువ పని గంటలతో పనిచేస్తున్నామన్నారు. విద్యుత్ సంస్థ లాభాలు తీసుకురావడంతో కాంట్రాక్ట్ కార్మికులు ప్రధాన భూమిక పోషిస్తున్నారన్నారు. సర్వీసును పరిగణలోకి తీసుకుని ఖాళీ పోస్టుల్లో వెయిటేజ్ ఇవ్వాలన్నారు. ట్రాన్స్‌కోలో డిప్లొమో చదివిన వారందరికీ జూనియర్ ఇంజనీర్ పోస్టులను ఇవ్వాలని కోరారు. అర్హత ఉన్న నాన్ టెక్నికల్ పోస్టుల్లో ప్రస్తుతం పని చేస్తున్న పీజీ, డిగ్రీ పూర్తి చేసిన కార్మికులతో భర్తీ చేయాలన్నారు. జెన్‌కో ట్రాన్స్‌కో డిస్కమ్‌లలో 30ఏళ్ల మొదలుకొని 10ఏళ్ల పాటు పనిచేస్తున్న కార్మికులను పర్మినెం ట్ చేయాలన్నారు.కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ కార్మికులను క్రమబద్ధీకరించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

పండుగలను ప్రశాంతంగా నిర్వహించుకుందాం

వెలుగోడు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ప్రతి పండుగను కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ కలిసిమెలిసి ప్రశాంతంగా నిర్వహించుకుందామని ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్ తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణంలో మండలంలో వినాయక విగ్రహ కమిటీల నిర్వాహకులతో, పీస్ కమిటీ సభ్యులతో ఆయన సమావేశం నిర్వహించారు. వెలుగోడు మండలంలో మూడు రోజుల పాటు విగ్రహాలను పూజించి మూడోరోజు నిమజ్జనం చేయాలని సూచించారు. విగ్రహ ఏర్పాటుకు ఆయన తగిన సలహాలు, సూచన లు చేశారు. ఈ కార్యక్రమంలో సీఐ సుధాకర్ రెడ్డి, ఎస్ఐ సురేష్, పీస్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సంఘం సేవలు ఎనలేనివి



విద్యార్థిని సన్మానిస్తున్న పూర్వ విద్యార్థుల సంఘం నేతలు

వెలుగోడు ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): వెలుగోడు పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం సేవలు ఎనలేనివని విశ్రాంత సీఈవో జయపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం పాఠశాల ఆవరణంలో ప్రతిభ చాటే విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. ప్రతి ఏటా పదో తరగతిలో ప్రతిభ చాటిన విద్యార్థులకు, వారి ఉన్నత చదువుల కోసం ఉపకార వేతనాలు అందించి విద్యాభివృద్ధికి పాటు పడటం అభినందనీయమన్నారు.

సంబరాలను జయప్రదం చేద్దాం: ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి

వెలుగోడు ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో అన్నదాత సుఖీభవ పథకం కింద లబ్ధిపొందిన రైతులతో రైతు సంబరాలు చేద్దామని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం ఎమ్మెల్యే బుడ్డా స్వగ్రామమైన వేల్పనూరులో నియోజ కవర్గంలోని ముఖ్య నేతలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆత్మకూరులో ఈ నెల 25న రైతు సంబరాలు, 31న స్త్రీశక్తి సంబరాలు నిర్వహిద్దామన్నారు. అదే రోజున మార్కెట్ యార్డు చైర్మన్, నియోజకవర్గంలోని సొసైటీల నూతన కమిటీలతో ప్రమాణ స్వీకారం కూడా ఉంటుందన్నారు. టీడీపీ నాయకులు రామలింగారెడ్డి, శివరామిరెడ్డి, రజాక్, అన్నారపు శేషిరెడ్డి, అబ్దుల్ కలాం, రసూల్, క్రిష్టారెడ్డి, రవీంద్రబాబు, అబ్దుల్లాపురం బాషా తదితరులు పాల్గొన్నారు.

'గిరిజన నాయకులా.. వైసీపీ కార్యకర్తలా..?'



మాట్లాడుతున్న స్వామినాయక్

నంద్యాల రూరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : గిరిజన నాయకుల ముసుగులో కొందరు వైసీపీ కార్యకర్తల వ్యవహరిస్తున్నారని ఎస్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి, నంద్యాల మార్కెట్ యార్డు డైరెక్టర్ స్వామినాయక్ అగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడతూ గిరిజనుల ముసుగులో ఉన్న వైసీపీ కార్యకర్తలు శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డిపై ధర్నా చేస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో అనేక ప్రాంతాలలో గిరిజనులపై దాడులు జరుగుతుంటే అప్పుడు ఈ నాయకులు ఎక్కడికి పోయారని ప్రశ్నించారు. గిరిజనుల అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్న బుడ్డా రాజశేఖర్ రెడ్డిపై ఆరోపణలు చేయడం తగదన్నారు. అప్పటి ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ఎస్ఎల్ తాండాకు చెందిన శివనాయక్‌పై దాడి చేసినప్పుడు ధర్నాలు ఎందుకు చేయలేదన్నారు. ఎమ్మెల్సీ అనంతబాబు కారు డ్రైవర్‌ను చంపి డోర్ డెలివరి చేసినప్పుడు ముడుపులు అందాయనన్నారు. ఈ సమావేశంలో శ్రీశైల నియోజకవర్గ ఎస్టీసెల్ అధ్యక్షుడు నాగరాజునాయక్, రవీంద్రనాయక్, వెంకటేష్ నాయక్ రమేష్ నాయక్, నాగస్వామి నాయక్, లలితకుమార్, సురేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న వైద్యాధికారి పవన్‌కుమార్

ఆత్మకూరురూరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) :సీజనల్ వ్యాధులతో గిరిజనులు అప్రమత్తంగా ఉండాలని బైర్లూటి వైద్యాధికారి పవన్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని రుద్రకోడూరు చెంచు గూడెంలో ప్రత్యేక వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసి 45 మందికి చికిత్సలు నిర్వహించారు. అలాగే గర్భిణులను పరీక్షించి అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ పవన్‌కుమార్ మాట్లాడుతూ.. ఆత్మకూరు ప్రాంతంలో గత కొన్ని రోజులుగా వర్షాలు కురుస్తుండటం వల్ల ఎక్కడపడితే అక్కడ వర్షపునీరు నిలిచి దోమలు ప్రబలేందుకు అవకాశం ఉందన్నారు. దోమల వల్ల మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ వస్తాయన్నారు.

మహానంది: వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలని తిమ్మాపురం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఎంపీహెచ్‌ఈఓ ఉసేన్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మహానంది సమీపంలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు ఆయన వైద్య పరీక్షలు నిర్వహించారు. మందులు అందజేసారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పార్టీ కోసం కష్టపడిన వారికే పదవులు : ఎమ్మెల్యే



సింగిల్‌విండో చైర్మన్‌గా ప్రమాణం చేస్తున్న పిక్కిలి శ్రీనివాసులు, సభ్యులు తిరుపతిరెడ్డి, శేఖర్

జూపాడుబంగ్లా, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): పార్టీ అభివృద్ధికి కష్టపడిన కార్యకర్తలకే పదవులు వస్తాయని నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య, టీడీపీ నంద్యాల పార్లమెంటు ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి అన్నారు. జూపాడుబంగ్లాలో శుక్రవారం 80బన్నూరు సహకార సొసైటీ సింగిల్‌విండో చైర్మన్‌గా పిక్కిలి శ్రీనివాసులు, సభ్యులుగా తిరుపతిరెడ్డి, పసుపుల శేఖర్‌చే సొసైటీ అధికారులు ప్రమాణ స్వీకారం చేయించారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే జయసూర్య, మాండ్ర శివానందరెడ్డి మాట్లాడుతూ పార్టీలో కష్టపడే ప్రతి కార్యకర్తను అధిష్టానం గుర్తించి పదవులు ఇస్తుందన్నారు. పేద , బడుగు బలహీన వర్గాలకు టీడీపీ పార్టీ అండగా ఉండటమేకాకుండా పదవులు ఇవ్వడం చంద్రబాబుకే సాధ్యమ న్నారు. వైసీపీ ప్రభుత్వ హయంలో సహకార సొసైటీలు, ఆర్బీకేలను భ్రష్టుపట్టించి రైతులకు కనీసం ఎరువులను అందించలేక పోయారన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు రైతుసేవా కేంద్రాలు, సహకార సొసైటీలకు ఎరువులను సరఫరా చేసి ఎరువుల కొరతలేకుండా చేస్తున్నామన్నారు. ప్రమాణ స్వీకారం అనంతరం చైర్మన్ పిక్కిలి శ్రీని వాసులు మాట్లాడుతూ ఎమ్మెల్యే జయసూర్య, మాండ్ర శివానందరెడ్డి అప్పగించిన ఈబాధ్యతను సక్రమంగా నిర్వహిస్తామని, సహకార సొసైటీ అభివృద్ధికి కృషిచేస్తామని చెప్పారు. రైతులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కరించేందుకు కృషిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు యాదవ్, మార్కెట్ యార్డు చైర్మన్ ప్రసాదరెడ్డి, టీడీపీ మండల నాయకులు మోహన్‌రెడ్డి, గిరీశ్వరరెడ్డి, పరమేశ్వరరెడ్డి, జంగాలపెద్దన్న, రవికుమార్ యాదవ్, సుధాకర్, రవికాంత్, నారాయణరెడ్డి, రమణారెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, బాలమద్దిలేటి, రాముడు, వెంకటరమణనాయుడు పాల్గొన్నారు.

అర్హులందరికీ న్యాయం చేస్తాం

నందికొట్కూరు: ఆందోళన వద్దని, అర్హులైన దివ్యాంగ పింఛన్‌దారులందరికీ న్యాయం చేస్తామని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, టీడీపీ లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాండ్ర శివానందరెడ్డి అన్నారు. శుక్రవారం దివ్యాంగ పింఛన్‌దారులు జూపా డుబంగ్లాకు వెళ్తున్న మాండ్ర, ఎమ్మెల్యేల వాహనాలను ఆత్మకూరు రోడ్డులో ఆపి తమ సమస్యను విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అర్హులు కాకపోయినా దివ్యాంగ పింఛన్లు తీసుకున్న వారిని మాత్రమే తొలగిస్తామన్నారు. నోటీసులు వచ్చిన వారు ఎంపీడీవో కార్యాలయంలో సర్టిఫికెట్ అందజేస్తే తిరిగి పింఛన్ వస్తుందన్నారు.

కమనీయం.. శ్రీకృష్ణుడి గ్రామోత్సవం



స్వామివారి ఊరేగింపులో పాల్గొన్న త్రైత సిద్ధాంత సేవా సమితి సభ్యులు

అవుకు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞానవేదిక అవుకు కమిటీ ఆధ్వర్యంలో శ్రీకృష్ణుడి గ్రామోత్సవాన్ని కమనీయంగా శుక్రవారం నిర్వహించారు. ఈనెల 16న కృష్ణాష్టమి పండుగను పురస్కరించుకొని మార్కెట్ వీధిలో ప్రత్యేక మండపంలో కొలువు దీరిన శ్రీకృష్ణుడికి ఏడు రోజుల పాటు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. సాయంత్రం శ్రీకృష్ణుడి ప్రతిమను పల్లకిలో అలంకరించి గీతా బోధనలు, మహిళల కోలాటాల మధ్య వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. చిన్నారుల శ్రీకృష్ణుడి వేషాధారణ అందరిని అలరించారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత సేవా సమితి సభ్యులు జయనాగేంద్రప్రసాద్, నరేంద్ర, చంద్రమోహన్, శ్రీనివాసులు, ఆనంద్, ప్రసాద్, శ్రీనివాసులు, జయన్న పాల్గొన్నారు.

మెట్టుపల్లి గ్రామంలో..

ప్యాపిలి : మండలంలోని మెట్టుపల్లి గ్రామంలో శుక్రవారం శ్రీకృష్ణుడి విగ్రహ గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. త్రైత సిద్ధాంత ప్రబోధానంద సేవా సమితి ఆధ్వర్యంలో ఉత్సవాన్ని చేపట్టారు. కోలాటాలు, భజనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో కృష్ణుడి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలి

బనగానపల్లె, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణతో చదివి విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలని జేకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బ్రహ్మానందాచారి అన్నారు. మండలం లోని పలుకూరు జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో గత సంవత్సరం పదవతరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు వెంకట భవ్య, సుస్మిత, ఉదయవాణికి కడపజిల్లా దువ్వూరుకు చెందిన సుబ్రమణ్యం అచారి సహకారంతో నగదు బహుమతులు అందించారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వ్యాధుల నివారణపై అవగాహన ఉండాలి

బనగానపల్లె, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు సంక్రమిత వ్యాధులపై అవగాహన ఉండాలని హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు మేనేజరు మధుకుమార్ సూచించారు. ఏపీ ఎయిడ్స్ నియంత్రణ మండలి, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు సంస్థ ఆధ్వర్యంలో ఎయిడ్స్ నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. అధ్యాపకులు వసుంధర, కౌసల్యాదేవి, సూర్యనారాయణరెడ్డి, మహమ్మద్‌గౌస్, ఉమామహేశ్వరరెడ్డి, హ్యాండ్స్ సిబ్బంది, ఆఫ్రీన్, సోఫియా, హనీఫా సిబ్బంది పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల : సమాజాన్ని పట్టి పీడించే ఎయిడ్స్ భూతంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటసుబ్బయ్య సూచించారు. శుక్రవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. అధ్యాపకులు శ్రీనివాసరెడ్డి, బాల ఓబన్న, హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులు మధు కుమార్, వరలక్ష్మీ, శాంతి పాల్గొన్నారు.

అర్హులకు పింఛన్లు పునరుద్ధరించాలి

కొలిమిగుండ్ల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన దివ్యాంగులందరికీ వెంటనే పింఛన్లు పునరుద్ధరించాలని సీపీఎం, దివ్యాంగుల సంఘం నాయకులు దావీదు, మద్దిలేటిరెడ్డి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయం వద్ద దివ్యాంగులు నిరసన వ్యక్తం చేశారు. డిప్యూటీ ఎంపీడీవో చంద్రమౌళి గౌడుకు వినతి పత్రం అందజేశారు.

హెల్మెట్ ధరించాలి

ప్యాపిలి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదమని ఎస్‌ఐ నాగార్జున అన్నారు. శుక్రవారం మండలంలోని చిగురుమాను దగ్గర రోడ్డుపై వాహనాల తనిఖీ చేశారు. ద్విచక్రవాహనదారులకు హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించారు. హెల్మెట్, లైసెన్స్ లేని వాహనదారులకు జరిమానా విధించారు.

రేషన్ పంపిణీలో పారదర్శకంగా ఉండాలి

ఆళ్లగడ్డ, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): రేషన్ డీలర్లు నిత్యావసర వస్తువుల పంపిణీలో పారదర్శకంగా ఉండాలని తహసీల్దార్ జ్యోతి రత్నకుమారి తెలిపారు. శుక్రవారం రెవెన్యూ కార్యాలయంలో మండలంలోని రేషన్ డీలర్లతో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో డీలర్ల సంఘం అధ్యక్షుడు మజీద్, డీలర్లు పాల్గొన్నారు.

గ్యాస్ వినియోగంపై అవగాహన

బేతంచెర్ల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని డ్రైవర్స్ కాలనీలో అల్లాబకాష్ దర్గా, సుందరయ్య కాలనీలో హెచ్‌పీ గ్యాస్ కంపెనీ ఆధ్వర్యంలో గ్యాస్ వినియోగంపై శుక్రవారం ప్రజలకు అవగాహన కల్పించారు. మహిళలు వంట గ్యాస్ వినియోగంపై అవగాహన ఉండాలని హెచ్‌పీ గ్యాస్ ఆపరేటర్ మధు అన్నారు. గోడౌన్ ఇన్ చార్జి మహేష్, రెహానా, పార్వతమ్మ, కావేరి, బి.శేఖర్, మహబూబ్ బాషా, అఖిల, రాందాస్, హేమంత్ కుమార్, పల్లవి, అమర్ పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుల్ మాదన్నకు సేవా పతకం

● అభినందించిన డీఎస్పీ, సీఐలు



హెడ్‌కానిస్టేబుల్ మాదన్నకు అవార్డు అందిస్తున్న డీఎస్పీ

డోన్ టౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): డోన్ పట్టణ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హెడ్‌కానిస్టేబుల్ ఏ.మాదన్నకు అతి ఉత్కృష్ట సేవా పతకం అవార్డు వరించింది. శుక్రవారం డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ ఇంతియాజ్ బాషా హెడ్ కానిస్టేబుల్ ఏ.మాదన్నకు అవార్డును అందజేసి అభినందించారు. డీఎస్పీ మాట్లాడు తూ మాదన్న నిజాయితీ, కృషి, అంకితభావం పోలీసు విభాగానికి గర్వకారణమన్నారు.

తల్లిదండ్రులకు బాలిక అప్పగింత

సంజామల, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఈనెల 18న అదృశ్యమైన బాలికను తల్లిదండ్రులకు అప్పగించినట్లు ఎస్‌ఐ రమణయ్య శుక్రవారం తెలిపారు. మండలంలోని ఒక గ్రామానికి చెందిన బాలిక అదృశ్యమైనట్లు బాలిక తల్లి ఫిర్యాదు చేయడంతో ఎస్‌ఐ రమణయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక గాలింపు చేపట్టారు. కడప జిల్లాలోని ఓ గ్రామంలో ఉన్నట్లు ట్రేస్ కావడంతో ఉదయాన్నే అక్కడి నుంచి బాలికను తీసుకొనివచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. ఎస్‌ఐకి బాలిక తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

48 మొబైల్ ఫోన్లు రికవరీ

డోన్ టౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): పలుచోట్ల పోగొట్టుకున్న 48మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు ఇచ్చినట్లు డోన్ పట్టణ, రూరల్ సీఐలు ఇంతియాజ్ బాషా, రాకేష్‌బాబు తెలిపారు. శుక్రవారం డోన్ డీఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో మొబైల్ ఫోన్ల రికవరీ మేళా నిర్వహించారు. 48మంది బాధితులకు ఫోన్లు అందజేశారు. మొబైల్ ఫోన్లు దక్కడంతో బాధితులు హర్షం వ్యక్తం చేస్తూ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా అమ్మవారి పల్లకీ సేవ

బనగానపల్లె, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): నందవరం చౌడేశ్వరీమాత ఆలయంలో శుక్రవారం అమ్మవారి పల్లకీసేవ సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈవో శ్రీనివాసరెడ్డి, కమిటీ చైర్మన్ పీవీ.కుమార్‌రెడ్డి, పూజారులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా లోతట్టు వంతెనలు

- వరద వస్తే తప్పని కష్టాలు
- ఏళ్ల నుంచి ఇబ్బందులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

చాగలమర్రి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ప్రతియేటా వర్షాకాలంలో లోతట్టు వంతెనలపై వరద నీరు ప్రవహించడంతో ఆయా గ్రామాల ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. వరద వచ్చిన ప్రతిసారీ రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఆ సమయంలో ఆయా గ్రామస్థులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. మండలంలోని బ్రాహ్మణపల్లె, కలుగొట్లపల్లె గ్రామాల సమీపంలో వక్కిలేరుపై లో లెవల్ వంతెనలు ఉన్నాయి. యేటా వర్షాలకు వరద నీరు వంతెన ఎక్కి పారుతోంది. దాంతో రాకపోకలకు గ్రామస్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. పంట పొలాలు కూడా నీట మునుగుతున్నాయి. ఆయా గ్రామస్థులు గొట్లూరు గ్రామానికి చేరుకొని అక్కడి నుంచి వాహనాల్లో కడప జిల్లా ప్రొద్దుటూరుకు వెళ్లాల్సి వస్తోంది. ఈ స్థితి 26 ఏళ్ల నుంచి ఉన్నది. కలుగొట్లపల్లె గ్రామంలో 100 కుటుంబాలు, బ్రాహ్మణపల్లెలో సుమారు 200 కుటుంబాలు ఉన్నాయి. 1,500 మంది దాకా జనాభా ఉన్నారు. లోతట్టు వంతెనలు కావడంతో ఏడాదిలో కనీసం ఐదుసార్లు వరద కష్టాలు తప్పడం లేదు. బ్రాహ్మణపల్లె నుంచి గొట్లూరు గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని, నేలవంతెనలను తొలగించి హైలెవెల్ వంతెనలు ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు ఏళ్ల నుంచి కోరుతున్నారు. అయినా పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి హైలెవెల్ వంతెనలు నిర్మించాలని కోరుతున్నారు.



బ్రాహ్మణపల్లె వక్కిలేరుపై లోతట్టు వంతెన



కలుగొట్లపల్లెలో లోతట్టు వంతెన

ప్రాణాలు పోతున్నాయి



వక్కిలేరు పొంగినప్పుడు అనారోగ్యానికి గురైతే వైద్యం అందే పరిస్థితి లేదు. ఊరు దాటే వీలు లేకపోవడంతో ప్రాణాలు పోతున్నాయి. ప్రతి ఏడాది వర్షాలు పడితే వంతెనపై రాకపోకలు స్తంభించిపోతాయి. వరద నీటిలో రాకపోకలు చేయలేక ఇబ్బంది పడుతున్నాం. అధికారులు స్పందించి హైలెవెల్ వంతెన నిర్మించాలి.

- భాస్కర్‌రెడ్డి, రైతు, బ్రాహ్మణపల్లె గ్రామం

వరద వస్తే కష్టాలు



వరద వచ్చిన ప్రతిసారి ఇబ్బంది పడుతున్నాం. వక్కిలేరు పొంగితే రాకపోకలు ఉండవు. అత్యవసరమైతే పక్క గ్రామాల నుంచి వెళ్లాల్సి వస్తోంది. లోతట్టు వంతెన కావడంతో వరద వచ్చినప్పుడల్లా రాకపోకలు సాగించలేకపోతున్నాం. వరద వచ్చిన సమయంలో వారం రోజుల పాటు కష్టాలు తప్పవు. పాలకులు, అధికారులు స్పందించి హైలెవెల్ వంతన నిర్మాణం చేపట్టాలి.

- రాజేష్, యువకుడు, కలుగొట్లపల్లె గ్రామం

డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు

శిరివెళ్ల, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి) : మండలంలోని యర్రగుంట్ల గంగుల తిమ్మారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరంలో చేరేందుకు అడ్మిషన్లు జరుగుతున్నట్లు ప్రిన్సిపాల్ ఇంద్రావతి శుక్రవారం తెలిపారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కళాశాలలో బీఏ, బీఎస్సీ, బీకాం కంప్యూటర్స్ తదితర కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. విద్యార్థులు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా అడ్మిషన్లు పొందవచ్చన్నారు.

డోన్ డిగ్రీ కళాశాలలో..

డోన్ రూరల్: ఇంటర్ పూర్తయిన విద్యార్థులు డోన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ భారతి శుక్రవారం కోరారు. కళాశాలలో బీఏ, బీ.కాం, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్, మ్యాథమాటిక్స్ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆసక్తిగల విద్యా ర్థులు కళాశాలలో సంప్రదించి దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

ఆవుల యజమానులకు నోటీసులు

రుద్రవరం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో దేవుని పేరిట వదిలిన ఆవుల యజమానులకు నోటీసులు జారీ చేసినట్లు పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి రామకృష్ణ శుక్రవారం తెలిపారు. గ్రామంలో దేవుళ్ల పేరుతో వదిలిన ఆవులు పొలాలపై పడి పంటలను నాశనం చేస్తున్నాయని రైతులు ఫిర్యాదు చేశారన్నారు. గ్రామంలో టాంటాం వేయించామన్నారు. యజమానులు ఆవులను సంరక్షించుకోవాలని కోరారు. స్పందించని యెడల చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరిస్తా

● ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే కోట్ల

డోన్ టౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని 8వ వార్డులో ఎమ్మెల్యే పర్యటించారు. అక్కడి ప్రజలతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత అధికారులు సమస్యల ను పరిష్కరించేందుకు కృషి చేయాలని ఆదేశించారు. అనంతరం ప్రజల నుంచి వినతులు స్వీకరించి, పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అలాగే పట్టణంలోని శ్రీరామ్‌నగర్‌లో రూ.5 లక్షల నిధులతో మంజూరైన వాటర్ పైపులైన్ పనులకు శంకుస్థాపన కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై కేడీసీ ఎంఎస్ చైర్మన్ వై.నాగేశ్వరరావు యాదవ్‌తో కలిసి భూమి పూజ చేశారు. త్రివర్ణ కాలనీలో కొద్ది నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో టీడీపీ కార్యకర్త మంగమూరి గోపాల్ మృతి చెందాడు. ఆయనకు టీడీపీ సభ్యత్వం ఉండటంతో వారి కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల ఇన్సూరెన్స్ చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడు, టీడీపీ, బీజేపీ నాయకులు, సర్పంచులు ఉన్నారు.

బీమా చెక్కు అందజేత

ప్యాపిలి : మండల కేంద్రంలో టీడీపీ కార్యకర్త కుల్లాయప్ప ఇటీవల విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఆయనకు మంజూరు అయిన ప్రమాద బీమా చెక్కు రూ. ఐదు లక్షలను శుక్రవారం ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ కార్యకర్తల కోసం దేశంలో ఏ పార్టీ కూడా కార్యకర్తలకు ఇంత పెద్ద మొత్తంలో ప్రమాద బీమా కల్పించలేదన్నారు. కార్యకర్తల సంక్షేమమే ధ్యేయంగా చంద్రబాబు పనిచేస్తున్నారని తెలిపారు. అనంతరం ఆయన స్థానిక ప్రభుత్వ విశ్రాంతి భవనంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ వై నాగేశ్వరరావుయాదవ్, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, రాజా నారాయణమూర్తి, లక్ష్మీనారాయణయాదవ్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

చాగలమర్రి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలు సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి చంద్రశేఖర్‌రావు సూచించారు. శుక్రవారం డ్రైడే ఫ్రైడే సందర్భంగా డి.వనిపెంట చెంచుగూడెంలో దోమల నివారణపై చెంచులకు అవగాహన కల్పించారు. ఇంటింటికి వెళ్లి నీటి తొట్లను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి సత్యనారాయణ, ఆళ్లగడ్డ మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.శివ చంద్రారెడ్డి, ఆరోగ్య విస్తరణాధికారులు వెంకటేశ్వర్లు, సుబ్బరాయుడు, సీహెచ్‌వో కృష్ణమ్మ, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కస్తూర్బా పాఠశాలలో..

చాగలమర్రి కస్తూర్బా పాఠశాలలో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. మలేరియా, డెంగీపై అప్రమత్తంగా ఉండాలని సీహెచ్‌వో రమణమ్మ, హెచ్‌ఈ విజయభారతి సూచించారు. కార్యక్రమంలో ఎస్‌వో స్వప్న, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

దొర్నిపాడు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మన చుట్టూ ఉండే పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని డబ్ల్యూ.కొత్తపల్లి వైద్యాధికారి హుసేన్ సూచించారు. శుక్రవారం చాకరాజువేముల గ్రామంలో అంటువ్యాధులపై ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించారు. తాగునీటిని వేడి చేసి చల్లార్చి తాగాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో బాబయ్య, ఎంఎల్‌హెచ్‌పీ షకిల, ఏఎన్ఎం మహాలక్ష్మి, ఆశా వర్కర్లు ఉన్నారు.

సౌకర్యాలు కల్పించాలి

డోన్ రూరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీరామ్ నగర్, నల్లగుట్ట, హనుమాన్ నగర్‌లలో ప్రజలకు సౌకర్యాలు కల్పించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి నక్కి శ్రీకాంత్, ఐద్వా నాయకురాలు షమీమ్ భేగం కోరారు. శుక్రవారం శ్రీరామ్‌నగర్‌లో పర్యటించిన ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. సిమెంటు రోడ్లు, కాలువలు, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని కోరారు.

రక్తదానం చేయాలి

చాగలమర్రి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని సహారా సోషల్‌సర్వీస్, బ్లడ్ డోనర్ సంస్థ అధ్యక్షుడు ఉసేన్‌బీలాల్ తెలిపారు. శుక్రవారం వాసవీ డిగ్రీ కళాశాలలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ముందుగా సహకార సంఘ సభ్యులు, కళాశాల విద్యార్థులు కలిసి రక్తదానంపై గాంధీ విగ్రహం వరకు అవగాహన ర్యాలీ చేశారు. కడప జిల్లా ప్రొద్దుటూరు సురక్ష బ్లడ్ బ్యాంకు చైర్మన్ ఓబుళరెడ్డి, మేనేజర్ మణి ఆధ్వర్యంలో రక్తాన్ని సేకరించారు. 150 మంది యువకులు రక్తదానం చేశారు. 50వ సారి రక్తదానం చేసిన సంస్థ కోశాధికారి అబ్దుల్లాను, పలువురు యువకులను సన్మానించారు. కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షుడు కరిముల్లా, కోశాధికారి అబ్దుల్లా, దాత చక్రం షబ్బీర్, టీడీపీ బీసీసెల్ స్పోక్‌పర్సన్ సల్లానాగరాజు, ప్రిన్సిపాల్ షాబుద్దీన్, కో-ఆర్డినేటర్ మహేశ్వరయ్య, నాయకులు, సంస్థ సభ్యులు, యువకులు పాల్గొన్నారు.

నాపరాతి గనుల్లో నీళ్లు

● ఉపాధి కోల్పోతున్న గని కార్మికులు



భారీ వర్షాలతో గనుల్లో చేరిన నీరు

కొలిమిగుండ్ల, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి) : మండలంలోని వివిధ గ్రామాల్లో కొద్ది రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాలతో గని కార్మికులకు ఉపాధి కరువవుతోంది. నాపరాయి గనుల్లో చేరుతున్న వర్షపు నీరు గని కార్మికులకు తీవ్ర ఆవేదన కలిగిస్తోంది. వర్షం నీటితో గనులు నిండటంతో గని కార్మికులకు ఉపాధి కరువవుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొలిమిగుండ్ల మండలంతో పాటు, అవుకు, బనగానపల్లె తదితర ప్రాంతాల్లో నాపరాయి గనుల ద్వారా వేలాది కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. ఒక్క కొలిమిగుండ్ల మండలంలోనే 10వేల మంది కార్మికులు నాపరాతి గనులే ఆధారంగా జీవనం సాగిస్తున్నారు. అయితే ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కొలిమిగుండ్ల మండలంలోని బెలుం, బెలుంశింగవరం, మీర్జాపురం తదితర అనేక గ్రామాల్లోని నాపరాయి గనుల్లో వర్షం నీరు పెద్ద ఎత్తున చేరింది. లక్షలాది రూపాయాల పెట్టుబడి పెట్టి ప్రారంభించిన గనులు వృథాగా మారాయన్నారు. దీంతో కూలీలు పనులు వెతుక్కోవాల్సిన దుస్థితి నెలకొందన్నారు.

వైభవంగా శ్రావణమాస పూజలు



చాగలమర్రిలో పూజలు చేస్తున్న మహిళలు

చాగలమర్రి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామం లోని కన్యకాపరమేశ్వరి, కోదండరామాలయాల్లో శ్రావణ శుక్రవారం పూజలు వైభవంగా నిర్వహించారు. కన్యకాపరమేశ్వరి ఆలయంలో మహిళలు అమ్మవారికి చీర, సారె సమర్పించి సామూహిక వడి బియ్యం కార్యక్రమాన్ని నిర్వహించారు. వెండిరథంలో అమ్మవారిని కొలువు దీరింపజేసి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.



కొలిమిగుండ్ల: ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



బనగానపల్లె: నెమలి పింఛాలతో దర్శనమిచ్చిన వాసవీమాత

బనగానపల్లె: పట్టణంలోని కొండపేటలో వెలసిన వాసవీమాత శ్రావణమాస చివరి శుక్రవారం నెమలిపింఛాలతో భక్తులకు దర్శనమిచ్చారు. ఆర్యవైశ్యుల ఆరాధ్యదైవం వాసవీమాత నెమలిపింఛాలతో దర్శనమివ్వడంతో అధిక సంఖ్యలో ఆర్యవైశ్య మహిళలు వాసవీమాతను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

కొలిమిగుండ్ల : మండలంలోని వివిధ గ్రామాల్లో శ్రావణమాసం చివరి శుక్రవారం సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. మండలంలోని పేట్నికోట, బెలుం, కనకాద్రిపల్లె, తిమ్మనాయినిపేట, కొలిమిగుండ్ల, అంకిరెడ్డిపల్లె తదితర గ్రామాల్లోని కన్యకాపరమేశ్వరి, అన్నపూర్ణదేవి, అంకాళమ్మ, పార్వతీదేవి ఆలయాల్లో మహిళలు పెద్ద ఎత్తున పూజలు నిర్వహిరు. అమ్మవారికి కుంకుమార్చనలు, అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించి, ప్రత్యేక అలంకరణలు చేపట్టారు.

రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

బనగానపల్లె, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, ఎయిడ్స్ నియంత్రణ నివారణ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి క్విజ్ పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయికి బనగానపల్లె ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినులు ఏ. అనిత, షాహినా పర్వీన్ ఎంపికైనట్లు అధ్యాపకులు శుక్రవారం తెలిపారు. ఈ నెల 26న ఏపీ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ విజయవాడ వారు యూత్ ఫెస్టివల్‌లో భాగంగా నిర్వహించే క్విజ్ పోటీల్లో పాల్గొనున్నారు. విద్యార్థినులను జిల్లా వైద్య అధికారి వెంకటరమణ, జిల్లా లెప్రసీ ఎయిడ్స్ టీబీ అధికారి డాక్టర్ శారదాబాయి, క్లస్టర్ ప్రోగ్రాం అధికారి అలీ హైదర్‌ను అధ్యాపకులు అభినందించారు.

రేపు మంగపల్లెలో మెగా వైద్య శిబిరం

సంజామల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మంగపల్లెలోని పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి ప్రజా వైద్యశాలలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాట్లు చేసినట్లు నంద్యాల గురురాఘవేంద్ర బ్యాంకు కోచింగ్ గురు రాజా విద్యా సంస్థల డైరెక్టర్లు షేక్షావలి రెడ్డి, మౌలాలి రెడ్డి శుక్రవారం తెలిపారు. పలువ్యాధులకు కర్నూలు, నంద్యాల పట్టణాలకు చెందిన వైద్యులు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేస్తారన్నారు. వైద్య శిబిరానికి హాజరయ్యే రోగులు ఆధార్ కార్డు, మొబైల్ నెంబరుతో హాజరు కావాలన్నారు.

జూదరుల అరెస్టు

సంజామల, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఆల్వకొండలో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ రమణయ్య శుక్రవారం తెలిపారు. ఆల్వకొండ గ్రామ శివార్లలో ఎనిమిదిమంది పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో దాడులు నిర్వహించామన్నారు. నలుగురు పారిపోగా, మిగత వారిని పట్టుకున్నామన్నారు. వీరినుంచి రూ. 4,500 స్వాధీనం చేసుకున్నామన్నారు. మిగిలిన వారి కోసం గాలిస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

వ్యవసాయంపై అవగాహన పెంచుకోవాలి

ఉయ్యాలవాడ, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే వ్యవసాయంపై అవగాహన పెంచుకోవాలి మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం ఉయ్యాలవాడ గ్రామ సమీపంలో ఉల్లి పంట సాగుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉల్లి పంట విత్తనం దశ నుంచి కోత వరకు ఎలాంటి సస్య రక్షణ చేపట్టాలన్నదానిపై వివరించారు. ఆధునిక సాగు, సాంకేతికతలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ ట్రైనర్ ఉశేన్‌వలి, ఎంపీహెచ్‌ఈవో పనీష్ తదితరులున్నారు.

వినాయక ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి



శాంతి సమావేశంలో మాట్లాడుతున్న చాలగమర్రి ఎస్‌ఐ సురేష్

చాగలమర్రి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో వినాయక ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని చాగలమర్రి ఎస్‌ఐ సురేష్ సూచించారు. శుక్రవారం రాత్రి చాగలమర్రి పోలీసు స్టేషన్ ఆవరణలో పీస్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ విగ్రహాల ఏర్పాటు, నిమజ్జనం సమయాల్లో కమిటీ సభ్యులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి అన్నారు. ఐదురోజుల పాటు గణేష్ ఉత్సవాలు నిర్వహించాలని, మండపాల వద్ద కమిటీ సభ్యులు కాపలా ఉండాలని సూచించారు. విగ్రహాల ఏర్పాటు కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా విశ్వహిందూపరిషత్ అధ్యక్షుడు త్రినేత్ర మోహన్‌రెడ్డి, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గుత్తి నరసింహులు, ఉత్సవ కమిటీ సభ్యులు, హిందూ సంఘ నాయకులు పాల్గొన్నారు.

భద్రత నిబంధనలు పాటించాలి

బేతంచెర్ల: వినాయక చవితి ఉత్సవాల్లో నిర్వాహకులు విద్యుత్ భద్రత నియమాలను పాటించాలని బేతంచెర్ల విద్యుత్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మధుసూదన్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ బేతంచెర్ల ప్రాంతంలో భారీ గణేష్ విగ్రహాల ఊరేగింపు సమయంలో విద్యుత్ భద్రతకు సంబంధించిన ముఖ్యమైన సూచనలను పాటించాలని తెలిపారు. విద్యుత్ తీగల కంటే ఎత్తులో విగ్రహాలు ఏర్పాటు చేయడం వల్ల విద్యుత్ ప్రమాదాలను నివారించేందుకు సరఫరాను తాత్కాలికంగా నిలిపివేయాల్సి వస్తుందన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలన్నారు. విద్యుత్ సరఫరాపై సొంత నిర్ణయాలు తీసుకోకూడదన్నారు.

గణేశ్ ఉత్సవాల్లో నిబంధనలు పాటించాలి

కొలిమిగుండ్ల : మండలంలోని వివిధ గ్రామాల్లో గణేశ్ ఉత్సవాలు నిర్వహించుకునే కమిటీ సభ్యులు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని కొలిమిగుండ్ల సీఐ మద్దినేని రమేష్‌బాబు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని, మండపాల ఏర్పాటులో నిబంధనలు పాటించాలని సూచించారు. వినాయక ప్రతిమల ఏర్పాటు నుంచి నిమజ్జనం వరకు ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని సీఐ సూచించారు. నిబంధనలు పాటించకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రశాంత వాతావరణంలో పండుగ నిర్వహించుకోవడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు.